UNIVERSAL LIBRARY
OU_204088
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T923 254 V44A Accession No. G.T. 565.

Author [illegible]

Title [illegible]

This book should be returned on or before the date last marked below.

19 OCT

# ఆచార్య రంగా జీవిత కథ


ర చ యి త లు

ఉభయభాషాప్రవీణ

**జాస్తి వేంకట నరసయ్య**

వి ద్వా న్

**ధూళిపాళ వేంకట సుబ్రహ్మణ్యము, బి.ఏ.,**

ప్రధానాంధ్ర పండితులు : ఆర్. వి. యస్. సి. వి. యస్. హైస్కూలు

చిలకలూరిపేట, గుంటూరుజిల్లా



ప్ర కా శ కు లు

**భా ర తీ స మి తి**

పె ద పూ డి (గుంటూరు జిల్లా)

[0–12–0 లేక 75 న.పై.

Checked 1969

# తొలిపలుకు

పరాధీన జాతుల స్వాతంత్ర్య లబ్ధికి పోరాడు యోధుల జీవితములు ప్రాతః స్మరణీయములు. వ్యవసాయ ప్రధానమగు భారతదేశపు సర్వతో ముఖాభ్యుదయమునకు కృషీవలుడు వ్యావసాయక కార్మికుడు వహించు పాత్ర గణనీయము. అట్టి శ్రామికులు అన్నదాతలు దేశపునరుజ్జీవనమునకు సూత్రధారులు కాగల, సర్వజన శ్రేయస్కరమగు రాజ్యస్థాపనకు తన సర్వస్వము సమర్పించిన ప్రతిభాశాలి, అఖిల భారత నాయకుడు నగు ఆచార్య రంగా జీవితమును ఆంధ్రుడు, విద్యార్థి, విద్యార్థిని, భారతీయుఁడు చదివి నేర్చుకొన దగిన అంశము లెన్నని కలవు.

శ్రీ జాస్తి వేంకటనరసయ్య, శ్రీధూళిపాళ వెంకట సుబ్రహ్మణ్యం గార్లు తమ జాతీయ రచనలచే ఆంధ్రలో సుప్రసిద్ధులు. ఈ రచన లలితమై, రసమయమై, ధారాళముగా నట్టులేక నడచినది. విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, ఇట్టి జీవితములను పాఠశాలలలో బాలబాలికలచే చదివింప ఏర్పాటుజేసి వారి మనములందు దేశభక్తిని స్వాతంత్ర్య బీజముల రేకెత్తింప జేయుదురు గాత!

12-10-47
విజయవాడ

దుగ్గిరాల బలరామకృష్ణయ్య
“బౌద్ధవాఙ్మయబ్రహ్మ”.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| రైతు | .... | ౯ |
| బాల్యము | .... | ౧౧ |
| విద్యార్థి | .... | ౧౩ |
| విదేశగమనము | .... | ౧౭ |
| 'డి. లిట్. బిరుదు' | .... | ౨౧ |
| పొగరోడ | ... | ౨౩ |
| కొత్తసాగుబడి | .... | ౨౫ |
| ప్రొఫెసరు | .... | ౨౮ |
| ప్రజాసేవ | .... | ౩౧ |
| రైతాంగ విద్యాలయము | ... | ౩౪ |
| భారతీరంగా | ... | ౩౬ |
| సుభాస్ మైత్రి | .... | ౩౭ |
| వివిధ రంగములు | .... | ౩౯ |
| రచనలు | ... | ౪౪ |
| ఆంధ్రప్రదేశ్ | .... | ౪౮ |
| పద్యసుమాంజలి | .... | ౫౦ |

# జాతీయగీతము

జన గణ మన అధినాయక జయహే
భారత భాగ్య విధాతా !
పంజాబ సింధు గుజరాత మరాఠా
ద్రావిడ ఉత్కల వంగా!
వింధ్య హిమాచల యమునా గంగా
ఉచ్ఛల జలధి తరంగా!
తవ శుభ నామే జాగే
తవ శుభ ఆశిష మాగే!
గాహే తవ జయ గాథా
జన గణ మంగళదాయక జయహే
భారత భాగ్య విధాతా!
జయహే జయహే జయహే
జయ జయ జయ జయహే॥

# అనువాదము

సమస్త జనుల హృదయములను పరిపాలించు భారతదేశ సౌభాగ్య కర్తవైనట్టి నీకు జయమగుగాక !

నీ శుభ నామము పంజాబు, సింధు, గుజరాతు, మహారాష్ట్రము, ద్రావిడము, ఉత్కళము, బంగాళము మున్నగు దేశజనుల మనస్సులను ఉత్సాహంగ జేయుచున్నది.

అది వింధ్య, హిమాచల పర్వతములలో ప్రతిధ్వనించుచున్నది. యమునా, గంగా నదుల ప్రవాహగీతములందు విలీనమై, హిందూ సముద్ర తరంగములచే గానము చేయబడుచున్నది.

నీ ఆశీర్వచనములకొరకు వారు ప్రార్థించుచు, నీ కీర్తిని గానము చేయుచున్నారు.

భారతదేశ సౌభాగ్య కర్తవగు నీకు జయమగుగాక, జయమగుగాక, జయమగుగాక !



# రైతు

శ్రీమంతంబగు ధారణీవలయంబు నందలి జీవరాసుల కెల్ల నాహార మత్యావశ్యకము. అందును జ్ఞానమాత్రాధికుఁ డగు మానవునకుఁ దినుటకుఁ దిండియుఁ గట్టుటకు గుడ్డయు నవసరములు. ఆహార, వస్త్రాదికముల యుత్పత్తికి వ్యవసాయమే యాధారము. అట్టి వ్యవసాయమును సాగించువాఁడు రైతు. కావునఁ బ్రపంచమెల్ల రైతుపై నాధారపడి యున్నది.

అనాదినుండియు మన భారతవర్షమున వ్యవసాయము ముఖ్యవృత్తి. అందులకు దేశసహజస్వభావ మెంతయు ననుకూలించుచున్నది. శీతోష్ణస్థితియు, సర్వకాలములయందును సమృద్ధ జలప్రవాహములతో నొప్పారు గంగ, సింధు, బ్రహ్మపుత్ర, గోదావరి, కృష్ణ, తుంగభద్ర, పెన్నాది నదులును ఈదేశమునందలి వ్యవసాయాభివృద్ధికి దోహదమొసంగుచున్నవి. ప్రపంచఖ్యాతి గాంచిన మేలురకపు పశుసంతతికిఁ గూడ మనభూమి మనికిపట్టు. కావుననే మన దేశమునందు నూటికిఁ దొంబది మంది రైతులు.

ఒకనాఁ డీ దేశమున రత్నాల రాసులు పండించినాఁడు రైతు. సమస్త సంపదలతోఁ దులఁదూగినాఁడు రైతు. దేశీయార్థిక జీవనమునకు వెన్నెముకఁగా నిలిచినాఁడు రైతు. కాని, రాజకీయముగా వెనుకబడి పారతంత్ర్యమునఁ

జిక్కిన నాఁటనుండియు రైతుస్థితి నానాఁట క్షీణించుచున్నది.

సీ॥ ఎండవానల కోర్చి ఏఁడాది పొడవున
చెమటోడ్చి సేద్యంబు చేయుచుండు
భూమాతనే నమ్మి ప్రొద్దుగ్రుంకెడి దాఁక
మట్టిలో పొర్లాడి మాఁడుచుండు
ఇల్లు వాకిలి వీడి ఎల్ల వేళలయందు
పసుల కొట్టాలలో పండియుండు
మెఱుగన్న మెట్టిదో మెసవుటే ఎఱుఁగక
గొడ్డుకారపు కూడె కుడుచుచుండు
శ్రమకు ఫలితమ్ముగా ధాన్యరాశి రాఁగ
దాని భూస్వామికిని ఋణదాత కొసఁగి
శిస్తుకట్టంగ పెండ్లాము పుస్తె మిగుల
బ్రతికి యున్నాడు రైతు జీవచ్ఛవముగ.

ఉ॥ ఉన్న దఖండభూమి జన మున్నది నల్వదినాల్గుకోటు లే
మున్నను కూడుగుడ్డల కయో! యని కుందుచునుంటెగాని వే
ఱున్నదె దిక్కులేక పడియుండిన దీనుల నుద్ధరించు వా
రున్నగదా! సముజ్జ్వల మహోన్నతి గాంచుట దేశ మక్కటా!

అట్టి నేఁటి రైతుల దుస్థితిని గన్నులారఁ గాంచి, పేదవడి, బక్కచిక్కి, కష్టించి, కృశించు రైతుల దురవస్థలకు నాక్రోశమును జెంది రైతు భవిష్యత్తును నిర్ణయించి, వారల నుద్ధరింపఁ గంకణము ధరించిన జాతీయ నాయకులలో ఇరువదవ శతాబ్దమునఁ దన సర్వశక్తుల ధారవోయుచుఁ బ్రసిద్ధికెక్కినవాఁడు ఆచార్య యన్. జి. రంగ.

ఉ॥ దీనుల నుద్ధరించుటకు ♦ దీక్షను బూని నిరంతరమ్ము న
జ్ఞాన తమంబుఁ బాపుటకు ♦ జాతికి నూతన విద్య నిచ్చి దే
శాన దరిద్రమానవుల ♦ సాయము సేసినవాఁడు ధన్యుఁడౌ
మానవసేవయే జగతి ♦ మాధవసేవ గదా తలంపఁగన్.

# బాల్యము

గోగినేని రంగనాయకులు ఆంధ్రుడు. గుంటూరు జిల్లా బాపట్ల తాలూకాలోని నిడుబ్రోలు ఆయన నివాసస్థానము.

నిడుబ్రోలు గ్రామమునందలి రైతు కుటుంబములలోఁ బ్రఖ్యాతిఁబడసినవి రెండువంశములు. ఒకటి గోగినేని, రెండు పాములపాటి. గోగినేని వంశభూషణుఁడై నాగయ్యాఖ్యుఁడొకరుఁడుండెను. ఆతఁ డాస్తికుఁడు, దైవభక్తిపరుఁడు. వినయాది సద్గుణ గణవరిష్ఠుఁడు. ఆతని ధర్మపత్ని పాములపాటి వంశోద్భవ,సచ్చరిత్ర అచ్చమాంబ. వారిది కూడుగుడ్డలకు లోపము లేని సామాన్యమైన రైతుకుటుంబము. ఆ పుణ్య దంపతులకు 1900సంవత్సరము నవంబరు 7 ఏడవ తేదీన మన రంగా జన్మించెను. వారి కీతఁడే ప్రథమ సంతానము, పిదప వేంకటప్పయ్య లక్ష్మీనారాయణ లను వారిరువురు జననమందిరి. నాగయ్య గారి కీ మువ్వురే బిడ్డలు.

పూవునకు జన్మచేతనే తావి యబ్బును. రంగా కేఁడాది నిండకముందే దేశాచారము ననుసరించి, 'అన్నప్రాశనము' నొనరించిరి. ఆ సమయమునఁ బాయసమును వెండి గిన్నె యందుంచి మేనమామచేత బంగారు వస్తువులతో నా పాయసమును బిడ్డ నాలుకపై రాయింతురు. అంతియేకాక యొక పీటపై బంగారునగ లొకదెసను, పుస్తకములు, కలము, సిరాబుడ్డి మఱియొకవంక నుంచి, పారాడుచుండెడి పసిబిడ్డను నావైపు వదలుదురు. అప్పుడా బుడుతఁడేది తాఁకిన నా సంబంధమగు వృత్తి వ్యాపారాదులం దాతఁడు జీవిత

యాత్ర గడపుకొనునని పెద్దల నమ్మకము. అట్టి సమయమున మన రంగా ధగధగ మెఱయుచుండు నగల దెస కరుగక నేరుగ పుస్తకముల వైపునకుఁ జని వానిని గైకొనెను. నాఁడే రంగా గొప్ప విజ్ఞానవేత్తయగునని పెద్దలు మురిసి కొనిరి.

దేశ సంప్రదాయానుసారముగ నాగయ్యగారు మన రంగాను గ్రామ పాఠశాలయందుఁ జదువవేసిరి. అప్పుడు పల్లెటూరిబడులకుఁ బ్రత్యేకగృహములు లేవు. ఏ యుదారుని కొట్టముననో యొజ్జ కూరుచుండి తనచుట్టును మూఁగి యుండుశిష్యులకుఁ జదువు చెప్పుచుండెడివాఁడు. రంగాకాపాఠ శాల వాతావరణము నచ్చలేదు. అదియొక చీఁకటికొనేరుగా నుండెడిది, దుర్వాసనకు నిలయము. అందుచే రంగా బాల్యమునఁ జదువునందంత యాసక్తి లేక బడికి సరిగా పోవుచుండెడి వాఁడు కాదు.

చిన్నతనమున రంగాకుఁ జదువుటలో నిష్టము గల్గించుటకు వారి మేనమామగారి యాప్తమిత్రులగు జంపని ఆంజనేయులుగారాబాలుని దగ్గఱఁగూర్చుండఁబెట్టుకొని దేశ భక్తులపై యభిమానము గలిగించు చుండెడివారు. ఆతఁడే యాతనికిఁ జదువునందుత్సాహమును గలిగించెను.

ఇంతలో నాతని పదవయేఁట వాని తల్లి కాలధర్మ మందెను. అంతట నాతనిని బెంచు భారము పెత్తల్లియగు మంగమ్మగారిపైఁ బడెను. పెత్తల్లికి సంతానము లేదు: భర్తయుఁ జనిపోయెను. కావున వీరి యింటియందే యుండి బిడ్డల

నల్లారు ముద్దుగాఁ బెనుచుచుండెను. తల్లి లేని బిడ్డ లనిన గారాబ మెక్కువ గదా!

రంగాకు వీథిబడి యనిన రోఁత యనుపించెను గాని, పుస్తకములపై నతని కపేక్ష మిక్కుటము. ఆతఁ డెప్పుడు నేదియో యొక పుస్తకమును దీసికొని తమ కొట్టమునందలి చెక్కకుర్చీపైఁ గూరుచుండి చదువుకొను చుండువాడు. క్రొత్త పుస్తకము లనినఁ బ్రీతి. ఒకనాఁడు తన మేనమామ వద్ద నొక పెద్ద పుస్తకమును జూచెను. దానిని జదువవలెననుఁ గోరిక కలిగెను. తన పెత్తల్లినిఁ బుస్తకము తెచ్చిపెట్టు వఱకును గోకాడెను. పుస్తకమును గ్రహించి దానిని జదువునంత వఱకును నాతడు నిదురఁబోవలేదు. ఆపుణ్య పుస్తకమే విజ్ఞాన చంద్రికామాలవారి "రాణీసంయుక్త".

## వి ద్యా ర్థి

మ॥ వెఱ పన్నట్టిది లేదు లేశ మయినన్ విద్యార్థి! నీ కీ భువిన్
కఱవే లేదు విశాల ధైర్యమునకున్ కామ్యార్థ సంప్రాప్తికై;
మఱిపం బొప్ప స్వరాజ్యసిద్ధికొఱకై ముందే చనంజాలు నీ
సరి యెవ్వారలు భావిపౌరుడ! సుధీశాలీ! యువాగ్రేసరా!

ఆంగ్ల విద్యాభ్యాసమునందు దేశమునం దంతటను వ్యామోహము వెల్లివిరిసెను. ఆ గ్రామమునందును నాంగ్ల విద్యాసక్తి కలిగెను. పరిసర గ్రామమగు పొన్నూరున మాధ్యమికపాఠశాల కలదు. పిదప నదియే యున్నతపాఠశాల చేయఁబడి నిడుబ్రోలు గ్రామము హద్దులలోనికిఁ దేఁబడెను. పదునాల్గవయేట రంగా యాపాఠశాలయం దారవతరగతిలోఁ

(ఫస్టుఫారములో) ప్రవేశించెను. ఆతఁడెప్పుడు నుపాధ్యాయుల యిండ్లకడనే చదువుకొను చుండెడివాఁడు.

ఒకతూరి వాని పెత్తల్లి "నాయనా! ఎన్నఁడును నింటి వద్దఁ జదువవేమిరా?" యని ప్రశ్నించెను.

"అమ్మా! బాగుగనే చదువుకొనుచున్నాను. తరగతి యందు మంచి 'మార్కు'లను బొంది 'మానేటరు'గా నుంటి ననెను.

రంగా మూఁడు, నాలుగు ఫారములు చదువుచున్న ప్పుడు వినయ విధేయతలతో నాదర్శప్రాయమగు జీవితమును గడపెను. ఆతనికి భాగవతమునందలి ప్రహ్లాద చరిత్రలోని పద్యము మనసునకుఁ బట్టెను.

"తనయందు నఖిల భూతములందు నొక భంగి
సమహితత్వంబున జరుపు వాఁడు
పెద్దలఁ బొడఁగన్న భృత్యుని కైవడిఁ
జేరి నమస్కృతుల్ సేయువాఁడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన
మాతృభావనఁ జేసి మఱలువాఁడు
తల్లిదండ్రుల భంగి ధర్మవత్సలతను
దీనులఁ గావఁ జింతించువాఁడు

తే.గీ. సఖులయెడ సోదరస్థితి జరుపువాఁడు
దైవతములంచు గురువులఁ దలఁచువాఁడు
లీలలందును బొంకులు లేనివాఁడు
లలిత మర్యాదుఁడైన ప్రహ్లాదుఁ డధిప."

అను ప్రహ్లాదునివలెఁ దన జీవితమును జక్కదిద్దికోవఁ దలఁచి రంగా నడవడిని సాగించుచుండెను. అనాఁ డాతఁడొక

వేదాంతి. పండితుఁడు. భారతీయాచారముల ననుసరించి, పిలకజుట్టునే పెట్టుకొని, నిత్యము వేకువను గ్రామ సమీపమునఁ బ్రవహించు తుంగభద్రాతోయముల స్నానముచేయుచుండెను. ప్రహ్లాదుని వలెనే యాతఁడు బాల్యమునుండియుఁ బరస్త్రీలను దల్లుల వలె భావించుచుండెను. ఆ చిఱుత ప్రాయమునందు శ్రీ కందుకూరి వీరేశలింగముగారి బోధల యందు రంగా మనసు లగ్నమయ్యెను. అప్పుడప్పుడు తోడి బాలకుల నొకచోఁ గూర్చి దైవభక్తిని, బ్రహ్మచర్యమును, స్వామి వివేకానంద, రామతీర్థాదుల జీవితములను గూర్చి బోధించుచుండెను. అప్పుడే 'స్వామి రామతీర్థ', 'రుద్రమదేవి' యను గ్రంథముల రచించెను.

"ప్రాణి లోకంబు సంసార పతిత మగుట
వసుధపై గిట్టి పుట్టని వాఁడు గలఁడె
వాని జన్మంబు సఫల మెవ్వాని వలన
వంశ మధికోన్నతి వహించి వన్నెకెక్కు."


పై తరగతులందుఁ జదువునపుడు రంగాకు విద్యయందభిలాషవృద్ధియగుచుండెను. ఆతఁడు రాత్రులయందు బ్రొద్దుపోవు వఱకునుజదివి, మరల వేకువను మూఁడుగంటలకే మేల్కాంచి చదువుచుండెను. తాను చదువుకొనుటయేకాక పేదలగు విద్యార్థులకుఁ దగు సాయమును గావించుచుఁ జదివించెను. కొందఱఁ దనగృహముననే యుంచుకొనెను. మఱికొందఱకు వారము లొసఁగెను. వారికొఱకుఁ దానే జీతములఁ గట్టుచుండెను. అందులకుఁ దన యింటియందున్న ముసుపులను

దెచ్చి యుపయోగించుచుండెను. అట్లు చదువుకొని, పైకి వచ్చినవారిలో నొక రిప్పుడు న్యాయవాది.

విద్యార్థిగ నుండఁగనే రంగాకు మంచి గుణము లలవడెను. నాల్గవ ఫారము చదువునపుడు 'బిసెంటు డే' కు గ్రామములందు తిరిగి విరాళముల నాతఁడు వసూలుచేసెను. అప్పటినుండియే గ్రంథాలయసేవ ప్రారంభించెను. గ్రంథముల సేకరించి చిన్ని గ్రంథాలయమును నెలకొల్పెను. వేదికలపై నుపన్యసించుటయు నాఁడే ప్రారంభించెను. అపుడు జరిగిన యొక్క మహాజనసభయం దాతఁ డుపన్యసించి పెద్దల మన్ననలకుఁ బాత్రుఁడయ్యెను.

రంగా ఈవిధమగు పవిత్రజీవితమును నడపుచు,అకలంక బ్రహ్మచర్యము నాచరించుచు, తన విద్యార్థిదశను గడపుచుండెను. 1920 సంవత్సరము మార్చియందు 'స్కూలు ఫైనలు' పరీక్షకుఁ గూరుచుండెను. అప్పుడే యాతని వివాహమునకు సంబంధములు వచ్చుచుండెను.

రంగా కుటుంబమునకుఁ బిత్రార్జితము నలువది యెకరముల భూమియు, ముప్పదివేల కవిలయుఁ గలదు. దానికిఁ దోడు మాతామహుల యాస్తి వారికి సంక్రమించినది. ఈ యాస్తికిఁ దోడు రంగా, యాంగ్లవిద్య నభ్యసించు చుండెను. ఇఁక నాతనికిఁ గట్నముల నొసంగి, పిల్లనీయ వచ్చుటలో నాశ్చర్యమేమికలదు? ముప్పదివేలు, నలువదివేలు వరశుల్కము లిచ్చెద మనుచు నెన్నియో సంబంధములు వచ్చెను. కాని యవి యేవియు రంగాకు సమ్మతములు గాకుండెను.



భారతీరంగా

తుదకు వారి గ్రామమునకు రెండు మూఁడు మైళ్ళ దూరమునందున్న మాచవరము నుండి సంబంధ మొకటి వచ్చెను. వధువు భారతీదేవి. పది సంవత్సరముల బాలిక; వెలగా సుబ్బయ్య, పిచ్చమ్మ యను దంపతులకు 1910 లో శ్రావణ మాసమున నా బాల జననమందెను, తమ కదివరలోఁ గలిసిన సంబంధము గాకున్నను, కొలది కట్నమే యొసఁగినను మర్యాద నాశించి రంగా యా సంబంధమునకే తనసమ్మతిని జూపెను

వివాహము నిశ్చయింపఁబడెను. ఇఁక నేమి? సర్వసన్నాహములు సమకూర్పఁ బడెను. 1920 సంవత్సరము మే నెలలో మాచవరమునఁ కన్యాదాతగారి గృహమున నతి వైభవముగాఁ బరిణయము జరిగెను. ఆ యేఁడే స్కూలుఫైనలు పరీక్షయందు రంగా యుత్తీర్ణుఁడాయెను. గుంటూరు కళాశాలలోఁ జేరెను.

రంగా విద్యార్థిగా నున్నపుడు పొలమునకు వెళ్ళుచు రైతుల కష్టసుఖములు కనులార గాంచు చుండెడివాడు. జంపని ఆంజనేయులుగారు రంగాను ఉన్నతహూణ విద్యాభ్యాసమునకు సీమకంపవలెనని రంగా తండ్రికి సలహా నొసంగిరి. ఆకాలమున రంగా కుటుంబమునకును, గ్రామకరణము గారికిని తగాదా యుండెను. అందుచే రంగా తండ్రి నాగయ్య ఆంజనేయులుగారితో "అయ్యా! పిల్లవానిని సీమకుఁ బంపినఁజాల ధన మగునుగదా!" అని ప్రశ్నించెను.

"మీవాఁడు జిల్లాకలెక్టరగు" నని వారు సమాధాన మొసంగిరి.

అంత నాయమాయకుండగు రైతు "ఐతే కలెక్టరుగా వచ్చి యీ కరణాలు, తాశీలుదార్లనుండి మా రైతులను రక్షించగలడా? యని యడిగెను.

అందులకు వారు "బాబూ! కుఱ్ఱవానిని సీమకంపుము. ఈ చిల్లరఉద్యోగుల కట్టడిఁజేసెడి యధికారి యగు"ననిరి.

అంత నాతఁడు "భేష్! అట్లైన నెంత ద్రవ్యము వ్యయమైనను సరియే. మా వానిని సీమ కనుపుదు" ననెను. వెంటనే తగుప్రయత్నములు చేసికొని రంగా యాంగ్లభూమికిఁ బయనమయ్యెను.

## విదేశగమనము

అమరఁగ దేశముల్ తిరిగి అచ్చటి విద్యల నేర్చి వచ్చియున్
మమత స్వలాభమే కనక మానితులై కడు త్యాగమూర్తులై
క్రమముగ విద్యయున్ ధనము కాయము సర్వము దేశసేవకై
సమముగ ధారవోసిన విశాల యశుల్ గద దేశసేవకుల్.

రంగా 1920 లోనా యాంగ్లభూమినిజొచ్చి 'ఆక్సుఫర్డు' విశ్వ విద్యాలయమందు 'ఐ. సి. యస్.' పోటీ పరీక్షకుఁ జదువ నారంభించెను. ఆంగ్ల దేశమున 'ఆక్సుఫర్డు కేంబ్రిడ్జి' విశ్వవిద్యాలయములు విజ్ఞానప్రపంచమున మన ప్రాచ్యఖండము నందలి తొల్లిటి నలందా, తక్షశిల, అమరావతీ విశ్వవిద్యాలయముల వలె విఖ్యాతిగాంచినవి. ఆ విశ్వవిద్యాలయముల యందే మన జాతీయ వీరులెందఱో యుత్తీర్ణులైరి.

జాతీయ సమరాంగణమున గాంధీమహాత్మునకుఁ గుడిభుజముగా నిలిచిన మహమ్మదాలీ 'ఆక్సుఫర్డు' విశ్వవిద్యాలయమున నారి తేరినవాఁడే. నేటి మన భారత ప్రధాని జవహరులాలు 'కేంబ్రిడ్జి' విశ్వ విద్యాలయమునందు త్తీర్ణుఁడైన వాఁడే. అట్టి విశ్వవిద్యాలయమందే మన రంగా విజ్ఞాన సముపార్జనకుఁ బ్రవేశించెను,

అచటఁ జదువు కాలముననే తన స్వగ్రామమందు తాను, తన బాల్యమిత్రుఁడు పాములపాటి వేంకటకృష్ణయ్య గారు కలిసి స్థాపించి, కృష్ణయ్యగారిచే నడుపఁబడుచున్న 'రైతు' పత్రికకు రంగా వ్యాసములు పంపుచుండెను. అదియే భారత రైతు పక్షమున వెలువడిన ప్రథమ రైతు వారపత్రిక. తన యింగ్లాండు పయనమునకు మున్నే దాని ప్రకటనకుఁ దగిన యేర్పాటులు గావించెను.

రంగా తన సంరక్షకుడుగ, మిత్రుఁడుగనుండిన వి. రామ కృష్ణ (ఐ. సి. యస్.) గారి సాయమున ఆక్సుఫర్డులోని సెంటు కేథరిన్సునందుఁ బ్రవేశించి ఐ. సి. యస్. కుఁ జదువుచున్న కాలముననే మన భారతదేశమున 1921 లో గాంధీగారసహా యోద్యమమును బ్రారంభించిరి. ఆ జాతీయ సంరంభ ప్రభావ మింగ్లాండులోని భారత విద్యార్థి యువకులకును సోఁకెను. గాంధీజీ సహాయ నిరాకరణోద్యమమునఁ గారాగృహమున నాలుగునెలలు కఠినశిక్ష అనుభవింప నేఁగె నను వార్త వినగనే మన రంగా ఐ. సి. యస్. చదువునకు స్వస్తిచెప్పక యుండఁ జాలక పోయెను.

అతఁడు మఱుసటి వత్సరము తన విద్యా విధానమును మార్చుకొని తన యభిమాన విద్యను గణిత శాస్త్రమునుండి యార్థికశాస్త్రము, రాజకీయశాస్త్రముగా మార్పునొందించు కొనెను. కాని యాతని గణిత శాస్త్రాభ్యసనము వాని భావి జీవితమునందలి గ్రామముల యార్థికజీవన పునర్నిర్మాణమున కెంతయు సహాయక మయ్యెను.

రంగా 1922 లో 'ఆక్సుఫర్డులోని 'బార్నెట్ హౌసు' లో సాంఘిక శాస్త్రమును పఠించెను. అచట కొంద ఱాంగ్లేయ మిత్రుల సలహానుసరించి యింగ్లీషువారి కార్మికుల సాంఘి కార్థిక పరిస్థితులు తెలిసికొనుటకై బ్రిటీషు సామ్రాజ్య ప్రధాన నగరమగు లండనులోని 'టాయన్ బిహాలు' నందు కొంతకాలము వసించెను. అపుడే ప్రఖ్యాత బ్రిటీషు కార్మిక రక్షణ సంఘోద్యమ స్థాపకుఁడగు జే. జే. మాల్లన్‌గారి పరిచయము చేకూరెను. రంగా ఆ సంవత్సరము వేసఁగియందు 'బాంగోరు' స్కార్‌బరో, నగరములందలి వేసంగి పాఠశాలల కరిగి యచటి సోషలిష్టు కమ్యూనిష్టులతోఁ బరిచయముఁ జేసికొనెను. ఆ వేసంగి పాఠశాలలయందే దత్తుసోదరులు జి. డి. హెచ్. కోలు, హెచ్. యన్. బ్రెయిల్సుఫర్డు మున్నగు విఖ్యాత సామ్యవాదుల నేస్తమున సామ్యవాదము నందలి ముఖ్యసిద్ధాంతముల నవగాహన మొనర్చుకొనెను. నేటికిని బ్రెయిల్సుఫర్డు, కోలు, రంగా మిత్రులై యాయనయొక్క రాజకీయసూత్రముల వైదగ్ధ్యమును గొనియాడు చుందురు. బ్రెయిల్స్‌ఫర్డు సలహానుసరించి 1922 వేసంగియందు రంగా

ఇటలీ, జర్మనీ, ఫ్రాంసు, దేశముల సంచార మొనర్చెను. ఆ యా దేశములందలి రైతుసంఘములు సామ్యవాదము ననుసరించి నెలకొల్పిన సహకార సంఘములను గూర్చి యాతఁడు నేర్చుకొనవలెనని కుతూహలపడెను. అటులనే తన సంచారమునందు కార్మికసహకారోద్యమముల గుఱించి రంగా సమగ్రముముగ నెఱింగి 'జనీవా' యందు కొంతకాలము 'నానారాజ్య సమితి' అంతర్జాతీయ కార్మిక కార్యాలయములందుఁ బని చేయుచు వారి సేవాకార్యముల నర్థము చేసికొనెను. అతఁడప్పటి ఇటలీయందు ఫాసిస్టు లెటుల సోషలిస్టు, కమ్యూనిస్టు శక్తుల నతిక్రూరముగ నెదిరించుచుండిరో కన్నులారగాంచెను. అప్పటినుండి ఫాసిస్టు శక్తులపై విపరీతమైన కోపము పెరుగుచున్నది. రంగా ఆంగ్లదేశమున మూఁడు సంవత్సరములుండి రాజకీయ ఆర్థిక శాస్త్రపండితుఁ డను పట్టమును గైకొని 1923 లో మాతృదేశమునకుఁ దరలి వచ్చెను. ప్రభుత్వోద్యోగమందుఁ జేరుట కాతని కేమాత్రము కోరికలేదు. రషియాలో నెటుల కూలీల రాజ్య మేర్పడినదో అటులనే మనదేశమున రైతుకూలీ రాజ్యము స్థాపింపవలెనని యాతని పట్టుదల.

## 'బి. లిట్. బిరుదు'

రంగా భారతదేశమునకు వచ్చిననాటనుండియు 'రైతు' ఉద్యమమును ప్రారంభించెను. ఆయన గాంధిగారి బోధనలచే స్వాతంత్ర్య తృష్ణను గలిగియున్న భారత "రైతాంగము" నందుఁ ప్రబోధము గావించి రైతు మహాసభలను జరుపు

చుండెను. అట్టి మహాసభలలో అప్పికట్ల రైతుమహాసభ దిగ్విజయముగా జరిగెను. అందే కాంగ్రెసువాదుల సహకారము నంది రైతుల యెన్నికల ప్రణాళికను దయారుచేసెను. రంగా అందు కాంగ్రెసు నిర్మాణ కార్యక్రమముతోపాటు సామ్యవాదమునకుఁ బునాదు లగు భూమిశిస్తు, పన్నులు, పరిశ్రమాభివృద్ధులను గూర్చిన కార్యక్రమమును జొప్పించెను. ఈ రైతు సంఘములు కాంగ్రెసు వ్యతిరేక సంస్థలగు నని కొందఱు కాంగ్రెసు వాదులు సంశయించిరి. కాని రంగా తన దృఢతర విశ్వాసమును వీడక రైతు సంఘోన్నతికిఁ బాటుపడెను.

రంగా వ్యవసాయ కూలీలను గుఱించియుఁ బ్రయత్నములు సేసెను. ఆతడు 1923 లో జిల్లా వ్యవసాయ కూలీల సభను నిడుబ్రోలు నందు సమావేశ పఱచెను. ఇట్టి సభ హిందూదేశమునం దిదియే ప్రథమము. దాని కాతఁడే యధ్యక్షత వహించెను. కారణాంతరములచే రైతుమహాసభల వలె నీ సభలు అప్పుడు ప్రయోజనమునకు రాలేదు.

ఈ విధమగు దేశసేవ యొనర్చుచు నాతఁడు పుగాకు వర్తకమును నింగ్లాండుతోఁ జేయుచుండెను గుంటూరుజిల్లా పుగాకు పంటకుఁ బ్రసిద్ధి.

రంగా ఈ సందర్భమున లెక్కలను సరిజూచుకొని వచ్చుటకై యింగ్లాండునకరిగెను. 1923-26 ల మధ్య ఇంగ్లాండున కాతఁడు మఱి రెండుపర్యాయము లరిగెను.

1925 లో వెళ్ళునప్పుడు తన సతీమణినిగూడ వెంటఁ దీసికొని పోయెను. చదువు నిమిత్తము విదేశముల కేఁగిన మొదటి "రైతాంగన" యామెయే. రంగాయొక సంవత్సర మామె నచటఁ జదివించెను. దక్షిణ హిందూదేశపు ప్రత్తి పరిశ్రమను గురించి 'The Economics of the Handloom' చేనేత పరిశ్రమను గూర్చిన యార్థిక నీతిని దెలుపు (Thesis) సిద్ధాంతమును బ్రకటించినందున ఆక్సుఫర్డు విశ్వవిద్యాలయము వారు రంగాకు 'బి. లిట్.' బిరుదము నొసంగి గౌరవించిరి.

## పొ గ యో డ


రంగా అట్టిగౌరవమును బొంది సతీద్వితీయుఁడై మాతృ భూమికిఁ బయనమయ్యెను. వారొక పొగయోడపైఁ బయన మైరి. ఓడ యడుగుభాగము గంధకముతో నింపబడియుండెను. వారు పయనించుచుండిన ఆ యోడ జిబ్రాల్టరు జలసంధి నధిగ మించి మధ్యధరా సముద్రమునుఁ జొచ్చెను. పలుదేశముల నుండి వచ్చెడి ప్రయాణీకులెందఱో యందుఁ గలరు. కొందఱు రాజకీయములఁ జర్చించుకొనుచుండిరి. మఱికొందఱు మధ్య ధరా శీతోష్ణస్థితిని, యందలి వివిధ ఫల వృక్షసంపదనుఁ జర్చించుకొను చుండిరి. ఇంకను గొందఱు తమతమ దేశౌ న్నత్యమును ముచ్చటించు కొనుచుండిరి. మన రంగా దంప తులు నేదియో యిష్టాగోష్ఠిగాఁ గాలమును వెళ్ళబుచ్చుచు సంతోషించుచుండిరి.

ఇంతలో నోడ ప్రధానాధికారి (Captain) తో నౌక యాంగ్లేయుఁడు వాదించుచుండుటను వారు గాంచిరి. ఆ

యాంగ్లేయుఁడు క్రింది గంధకమునకు నిప్పంటు కొనెననియు కొలది కాలమునఁ బ్రమాదము సంభవించుననియు నుడువు చుండెను. ఆయోడ యధికారి మఱేమి ఆపద లేదని ధైర్యము సెప్పుచుండెను. రంగాగారును మఱికొందఱు ప్రయాణీకులును నచటికరిగి యోడయధికారితో వాదులాడి యోడయంతయుఁ బరిశీలించుచుండిరి. ఎట్టకేలకొక యెడ గంధకపుపొగ వారికిఁ గనుపించెను. ఇంతలోననే యోడయందు భగ్గున జ్వాలలు రేఁగెను. ప్రయాణీకులందఱు గొల్లున గోలఁజేయ మొదలిడిరి. నాఁటితోఁ దమ యసువులు పోవునని తలంచిరి.

ఓడ సాధారణముగాఁ జిన్న గ్రామమంత యుండును. మగవారెల్లరును గాలుచున్న వైపునువీడి మఱియొక దెసఁ జేరిరి. అపాయ సమయములఁ బ్రజల రక్షించుటకు నిలువ యుంచిన చిన్నబోట్లను (Life-boats) రబ్బరు చక్రములను సంద్రమున విడిచిరి. స్త్రీలందఱు వానియందుఁజేరి యాపారావార మధ్యమునఁ దేలియాడుచుండిరి. ఒకరిసంగతి యొకరికి లేదు. అంతయు నయోమయము.

అది ఈజిప్టుతీరమందలి జంబూతీద్వీపపరిసరప్రాంతము. వారు వెంటనే యీ ప్రమాదవార్తను నిస్తంత్రీ వార్త (Wireless) మూలమున తీరమునకుఁ దెలియజేసిరి. అతి రయంబున వీరి రక్షింప నోడయొంకు గుప్పుగుప్పున ధూమమును విడచుచు నట కరుదెంచెను. ప్రయాణీకుల ప్రాణములు లేచివచ్చెను. వారు భగవానుఁడు తమను రక్షింప నారూపమున వచ్చెనని యానందించిరి. అందఱును సురక్షితముగ



జంబూతీ నగరమునకుఁ జేర్పఁబడిరి. రక్షింపబడిన స్త్రీల నామములఁ దెలుపు పట్టికలను వెలువఱచిరి. వారుందు గదులసంఖ్యల నెఱింగి తమతమ యాఁడువారిని పురుషులందఱుఁ గలసికొనుచుండిరి. రంగా భారతీపేరును పట్టికయందుఁ జదువుకొని యామె యున్నచోటునకు వచ్చెను. తన భర్తను జూడఁగనే యా భారతీదేవి యమందానందమున దరహాసితవదనయయ్యెను. రంగా యామెను ప్రేమపూర్వకముగా దఱిఁ జేర్చుకొనెను. వాని కనుగొనలనుండి ముత్యపుబిందువులవలె నానందాశ్రువు లామె ముఖకమలముపైఁబడెను. తన ప్రాణనాథుని దనకు మరల లభింపఁజేసినందులకు భారతీదేవి భగవంతునికిఁ గృతజ్ఞతఁ దెలిపెను.

## కొత్త సాగుబడి

1926 లో రంగా స్వదేశమును జేరుకొనెను. అంతదనుక కాంగ్రెసు సభ్యుఁడుగ నుండెను. కాని రంగా కాంగ్రెసులోని యార్థిక కార్యక్రమము నచ్చనందున కాంగ్రెసునుండి విరమించుకొనెను. అయినను మరి యే యితర కక్షల యందును జేరక రైతుజన సముద్ధరణకే పాటుపడుచుండెను. ఆతఁడు పెదవడ్లపూడి, రేటూరు, అప్పాపురం ప్రాజెక్టుల నిర్మాణమునకై కృషిచేయుచు 1934 నకు అందుఁ గృతకృత్యుఁడయ్యెను. ఇందుచే ఆ రైతులకు నాల్గుకోట్లు అధికాస్తిపాస్తులు లభించినవి. 65000 యకరములు మాగాణి యయ్యెను. ఆకాలమున నాతఁడు రైతులోకమునకుఁ గావించిన సేవ యపారము. రంగా గుంటూరు, కృష్ణా మండలము

ళందలి రైతుసమస్యలయం దత్యంత శ్రద్ధవహించి రైతు బాంధవుండై మెలంగెను. జిల్లా, తాలూకా రైతుసంఘముల నెన్నింటినో నెలకొల్పెను. భూమినే నమ్ముకొని నిరంతరము శ్రమించు పేదరైతుల జీవితసమస్యలను గూర్చి యెన్నియో వ్యాసములు రంగా నాంటి వివిధపత్రికలయందును ప్రకటించు చుండెను. ఇంగ్లాండు వెళ్ళకపూర్వమే రంగా రైతుల బాధా నివారణ మిక్కిలి యవసర మని తన తండ్రినుండి ప్రాంతీయు లగు రైతుల యనుభవములనుండి తెలిసికొనెను. ప్రజా రాజ్యము కావలయు నని హృదయపూర్వకముగా నంగీకరించెను. కాని ఆ స్వరాజ్యము ధనవంతులకా లేక కష్టజీవులగు కర్షక కార్మికులకా యను సందేహ మాతనికికల్గెను. హృదయ మునకు శాంతి లేదు. ఇంగ్లాండునకు వెళ్లినపిదప రంగా లేబరు పార్టీనాయకులతో పరిచయముబొంది వారెట్లు కూలీరాజ్యము స్థాపింప నెంచుచున్నారో తెలిసికొనెను. మనదేశమునంగూడ కిసాన్ మజదూర్ ప్రజారాజ్య స్థాపన చేయవలయునని నిశ్చయించుకొనెను. 1917 లో రష్యాయందు కూలీల రాజ్యము స్థాపింపంబడినది. దానికి నాయకు లగు లెనిన్ మహాశయుని బోధనలను రంగా చదివెను. రష్యాయందు కార్మికరాజ్య మేర్పడి జయప్రదముగా సాగింపంబడుచుండ మనదేశము నందు మాత్ర మేల ప్రజారాజ్యమును స్థాపింపరాదు? అట్లు స్థాపింపబడినచో నది యెందులకు జయప్రదముగా నడువదు? ఈ యాలోచనలు వాని భావవీథియందు సంచరించుచుండెను. అందుచేతనే రంగ 1923 లోనే భారతదేశమునందు రైతు

కార్మిక రాజ్యస్థాపనకు కృషి చేయవలయు నను కృతనిశ్చయముతో మాతృభూమికి వచ్చెను. వచ్చిననాఁటనుండియు నాతఁడు దన యాశయసిద్ధికై దేశమునందు విరివిగాఁ బ్రచారము సాగించుచుండెను.

## ప్రొ ఫె స రు

ఎన్. జి. రంగా 1927 లో మద్రాసు నగరమందలి పచ్చయ్యప్ప కళాశాలయందు ఆర్థిక, సాంఘిక, శాస్త్రబోధనకు ప్రధానాచార్యుడుగా(Professor of Economics and Political Science) జేరెను. మాసమున కైదువందలరూప్యముల వేతనము. ఆతడు రాజకీయములయందుఁ బాల్గొనుటలో నభ్యంతరము సూపకుండునట్లు కళాశాలా నిర్వాహకులవద్ద హామీనిసైతముఁ గైకొనియెను. రంగా 1927 మొదలు 30 వఱకును (Honours) 'ఆనర్సు' తరగతుల నున్నత విద్యార్థులను దయారుచేసెను. రంగా శిష్యులలో నొక రగు శ్రీ గోపాలరావుగారు తన ప్రతిభను జూపి 'కడ్జను పతకమును' బహూకృతి నందెను. మఱొక్కరు డాక్టర్ శ్రీనివాసరావుగారు బెజవాడ కళాశాలకు (Principal) ప్రధానాచార్యులుగా నున్నవారు. వేఱొకరు మధ్యపరగణాలప్రభుత్వమునకు (Advocate General) 'అడ్వకేటు జనరలు' గా నున్నారు.

1928–29 సంవత్సరమున నాచార్యరంగ మద్రాసు ప్రభుత్వపు టార్థిక పరిశీలనాసంఘ నిపుణుఁడుగా (Special Officer for Economic Survey by Madras Govern-

ment) నియమింపఁబడెను. పారితోషికము నభిలషింపకయే నీలగిరి, కోయంబత్తూరు, సేలము, గుంటూరు మండలము లందు రంగా ప్రభుత్వపక్షమునఁ బరిశీలనను నెఱపెను. ఆయన నివేదికయందలి ప్రజల పేదఱికపులెక్కలను జూచుకొని భయమంది దొరతనమువా రా శాఖను, కార్యాలయమునుగూడ రద్దుపఱచిరి. తుద కా నివేదికనుగూడఁ బ్రచురింపరైరి.

అయినను 1929-30 సంవత్సరమున గోదావరి, కృష్ణా రీసెటిల్‌మెంటు విచారణసంఘమునకుఁ గార్యదర్శిగాఁ బ్రభుత్వము రంగాను నియమించెను. దాక్షిణాత్యులలోని యార్థిక శాస్త్రజ్ఞులందఱు వారినే ప్రధానులుగా నెంచుటవలన నియమించక తప్పదాయెను. ఆ సంఘమునకు కీ. శే. దివాన్ బహదూరు ఆర్. యన్. ఆరోగ్యస్వామి మొదలియారుగా రధ్యక్షులు. జాతీయ వీరులైన సర్దారు నారాయణరాజండొక సభ్యులు. ఆ హోదాలో రంగా యా మండలము లందలి నూఱు గ్రామముల యార్థిక స్థితిని బరిశీలించెను. మఱి నూఱు గ్రామముల రైతుల ఋణముల గూర్చి విచారణ జరిపెను. ఆ సంఘమువా రొక నివేదికను బ్రచురించిరి. అందులకుఁ గార్యదర్శిగారి బుద్ధికుశలతయు, సామర్థ్యమును నెంతయో యావశ్యకము లనుటలో నాశ్చర్యము లేదు.

మద్రాసు కళాశాలయం దాచార్యుఁడుగ నుండియే, 1929 లో శ్రీ మాగంటి బాపినీడు, యం. యస్. సి, (కాలిఫోర్నియా) గారి సహాకారముతో నాంధ్రరాష్ట్ర రైతుసంఘమును స్థాపించి, దాని కధ్యక్షుఁడుగా రంగా యుండెను. ఆ

సంవత్సరముననే రంగా మదరాసురాష్ట్రమున అటవీ పంచాయతుల సంఘ కార్యదర్శిగా నుండి పదకొండు వందల పంచాయతు లందలి రైతులకు సౌకర్యము లభింప నుత్తరువు లిప్పించి వారి యాదరణకుఁ బాత్రుఁడాయెను.

రంగా ఆ కాలముననే గుంటూరుజిల్లా గ్రామపంచాయితీ సంఘాధ్యక్షుఁడుగాఁ బనిచేసెను. ఆతఁడు మండలములో గల తొమ్మిదివందల యఱువది గ్రామములలో నేడు వందల గ్రామములకుఁ బంచాయతుల నెలకొల్పెను. అది వఱకుఁ బ్రభుత్వమువారు గ్రామ పంచాయతులకు భూమిశిస్తు నుండి రూపాయకు మూఁడుపైస లిచ్చుచుండువారు! రంగా గ్రామ పునర్నిర్మాణావసరముల కది చాలదని దొరతనము వారితో వాదించి, యొప్పించి దాని నాఱుపైసలకుఁ బెంచు నటులఁ జేసెను.

ఆతఁడు మదరాసుప్రభుత్వముచే నెలకొల్పబడిన మాగాణి వ్యవసాయిక సలహాసంఘమున కధ్యక్షుఁడుగా నెన్నుకొనఁబడి కృష్ణాజిల్లాలోని రైతులకుఁ జాల సహాయ మొనర్చెను. మరియు ఒంగోలు కఱవుబాధానివారణ సంఘమును స్థాపించి, రైతుల కపారసేవ నొనర్చెను. రంగా గుంటూరు మండల రైతు సంఘాధ్యక్షుడుగా నుండి యరువదియైదువేల యకరముల భూమి సాగుబడి యగునటులఁ నొనర్చెను. మఱియు ననేక గ్రామ గ్రంథాలయములు, సహకార పరపతి సంఘములు నెలకొల్పఁ దోడుపడెను.

ఆతఁడు కాంగ్రెసు సభ్యుఁడు కాకున్నను, ప్రభుత్వ కళాశాలయం దుద్యోగిగనున్నను, ప్రజలకొఱకే తన జీవిత మును గడపెను. జనుల కుపయోగపడు పెక్కు కార్యము లందుఁ బాల్గొనుచు నఖండ విఖ్యాతిని గాంచెను.

1930 లో స్వరాజ్యవాదులు శాసనసభలనుండి బయ టికి వచ్చిరి. కాని రంగా శాసనసభలయందుండి, చేయఁదగు పనులు చాలఁగలవని తలంచెను. అందుచే నాతడు ఆ కొలది కాలమునకు కృష్ణా, గుంటూరు మండలముల ప్రతినిధిగాఁ గేంద్ర శాసనసభలోఁ బ్రవేశించెను. ఆ రోజులలో గాంధీ టోపీతో, ఖద్దరు దుస్తులతో శాసనసభా రఁగమునను, రాజ ప్రతినిధి మందిరమునను సంచరించిన ధీరుఁ డాతఁడే.

రంగా శాసనసభయందుఁ బ్రభుత్వముతో ఢీకొని కాంగ్రెసు వారిపక్షమున వాదించెను. దేశమునందలి తన రైతుసోదరుల నెల్లఱను దొరతనమునకు సహకారముచేయవలదని యాతఁడు హెచ్చరించెను. కళాశాలాచార్యుఁడుగ నుండియే యిట్టి యుపన్యాసము లిచ్చుచున్నందునఁ గళాశాలాధికారు లాత నిపైఁ గినిసిరి. బోధకు లెవరును శాసనసభా సభ్యులుగా నుండరాదని యుత్తరువును జేసిరి. అందులకుఁ బ్రత్యుత్తర ముగా రంగా—

"కళాశాల యందలి పదవి, ప్రజాబాహుళ్యమునకు నే నొనర్పవలసిన విధి. ఈ రెంటియందు నేదే నొకటి నేను గోరు కొనవలసి యున్నచో నిస్సంశయముగ నేను రెండవ దానినే వరింతు" నని వారికిఁ దెలియఁజేసెను. తన పదవిని విసర్జిం

చెను. నాఁటి నుండియు మరల కాంగ్రెసునందుఁ జేరి ప్రజా సేవఁ జేయుచుండెను.

## ప్రజా సేవ

చ॥ బిరుదులు వీడి అర్జనలఁ బ్రీతి విసర్జనఁ జేసి సౌఖ్యముల్
పరమ ముదంబునన్ వదలి భారతదేశ స్వరాజ్య సిద్ధికై
పురుషత శాంతి యుద్ధమున పోరి శరీరము లాటిపోట్లకే
గురి యొనరించి జైళ్ళ బడి కోరి వరించిరి కష్టనష్టముల్.

రంగా శాసనసభయందు 'రౌండుటేబులు' సమావేశము నెడ తన విముఖతను వెల్లడించెను. అతఁడు 1930 లో జరిగిన మొదటి 'రౌండుటేబిలు' సమావేశము జరుగు సమయమున నింగ్లండున కరిగెను. ఆంగ్లభూమి కరిగి రంగా ఆ సభకు ప్రతికూలముగ నఖండ ప్రచారమొనర్చెను. కాంగ్రెసు కోరిన సత్వర స్వరాజ్యవాంఛయెడఁ దన యనుకూల వాదనను వెల్లడించెను. ఆంగ్ల మిత్రులతోఁ గూడి రంగా యాంగ్లభూమి నంతయుఁ గ్రుమ్మరెను. మరియు నచ్చటనుండియే 'హిందూ' 'బాంబే క్రానికల్' 'స్వరాజ్య' 'ఆంధ్రపత్రిక'లకు వ్యాసములు పంపుచు జాతీయతకు గట్టిపునాదు లేర్పరచుచుండెను.

ఇంగ్లండునందు నాతఁ డొనర్చిన కార్యమును గూర్చి యాతఁడే.

"నేను జైలునకుఁబోవని లోటును భర్తీ చేయుటకును, మహదాశయపూరిత మగు కాంగ్రెసు సంస్థయందుఁ జేరుటకుఁ బ్రథమ శిక్షణముగను నీసేవను జేయుచుంటి" ననెను.

ఆంగ్లభూమినుండి వచ్చిన నాఁటనుండియు 1931 లో నాతఁడు జమీందారీ రైతులయెడఁ దన దృష్టుల మరల్చెను. ఆంధ్ర జమీందారీ రైతుసంఘమును బునరుద్ధరించెను. ఆ వత్సరముననే వేంకటగిరిలో జరిగిన మహాసభలో రంగా గంభీరముగా నుపన్యసించి, "జమీందారీ విధానము నిర్మూలనము కావలె" నని మేఘగంభీర ఘోషణంబున గర్జించెను. అతని కృషి ఫలితమే నేటి యీ జమీందారీల రద్దు. జమీందారీ పద్ధతికి 1802 లో జరిగిన (Permanent Settlement) శాశ్వత శిస్తు నిర్ణయము మూలమున బ్రిటీషువారు క్రొత్త ప్రాణమును బోసిరి. నాటినుండియు మనదేశపు రైతుల యిక్కట్లు మిక్కుటమగు చుండెను. జమీందారుల బిరుదములు, ధనబలములు గాంచి వారిపెత్తనమున కెవ్వరు నడ్డుచెప్ప సాహసింపరైరి. కాఁగా వారికి బ్రిటీషు ప్రభుత్వపు మద్దతు లభించుటవలన వారి దురాగతమునకు మేరయే లేకుండెను. అట్టితఱి కాంగ్రెసు వారియందుఁగూడ నెవ్వరును వారి నెదిరింపఁజాలకుండిరి. కాని యారోజులయందే జమీందారుల క్రోధోద్ధతికి నిసుమంతయు జంకక 'జమీందారీలు నిర్మూలము కావాలి' యని యెలుంగెత్తి దశదిశాక్రాంత నిస్వనమునఁ జాటినవాఁడు రంగా యొక్కడు. జమీందారీ సమస్యను లేవనెత్తిన మేటి యాతఁడే.

ఆ 1931 సంవత్సరముననే మఱియొక విశేషము తటస్థించెను. నాఁటి ప్రభుత్వమువారు ప్రజల యాందోళనా ఫలితముగా వారి కన్నీరుఁ దుడుచుటకో యన, భూమిశిస్తు

లనుగూర్చి విచారణసంఘమును నియమించిరి. కాని యా విచారణ సంఘమువారు శిస్తులను పెంచకూడదని సలహా నొసంగిరి. ఐనను ప్రభుత్వమువారు మాత్రము శిస్తులఁ బెంచుటకే నిశ్చయించుకొని విచారణ సంఘమువారి సలహాలను పెడచెవిని బెట్టిరి. రైతు బాంధవుఁడగు రంగా యీ వార్త వినినవెంటనే ప్రభుత్వపు (Revenue Department) ఆర్థిక శాఖవారితోఁ బోరాడెను. ఈ యాందోళనమున నాతనికి బాపినీడు, నారాయణరాజు, కొమ్మారెడ్డి సత్యనారాయణ గారలు సహచరులుగానుండి యుద్యమతీవ్రతను నినుమడింపఁ జేసిరి.

బౌద్ధవాఙ్మయబ్రహ్మ దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారి సాయముతో కృష్ణాజిల్లాయందు మూఁడువందల గ్రామ రైతు సంఘముల స్థాపించిన రంగా సేవ నిరుపమానము. ఈతని ధాటికుఁ దాళఁజాలక ప్రభుత్వమువా రీతనికి సంవత్సరము జైలుశిక్ష నొసంగిరి. మఱి యేడుగురుగూడఁ జెఱబడిరి. ప్రభుత్వమువారు ఈయుద్యమఫలితముగా కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి మండలములందుఁ బన్నుల నిరాకరణోద్యమమునకు సంబంధించిన (ఆర్డినెన్సు) అత్యవసరపు చట్టములు పఱచిరి.

కార్యశూరులకు నిర్బంధమునం దుత్సాహ మతిశయించును. రంగా ప్రతినిత్యమెనిమిదిగంటలుపనిచేయుచు జైలులో నమూల్యములగుగ్రంథముల నాంధ్రాంగ్లభాషలో రచించెను. నానాదేశ ప్రభుత్వవిధానములనుగుఱించి విమర్శనలు చేసెను.

## రైతాంగవిద్యాలయము

జైలునుండి విడుదలైనపిమ్మట నాతఁడు విధివిరామము లేక ప్రజాసేవ చేయఁగలిగెను. రైతుయాత్రలను, సేవాదళము లను నడపెను. రంగా రైతాంగమునందలి స్తబ్ధతనుఁ బోన డంచ వేసంగి పాఠశాలల నేర్పరచెను. ప్రజాసముదాయము నకుఁ జైతన్యము గలిగింప దేశమునందుఁ బ్రప్రథమమున రైతాంగ విద్యాలయమును నిడుబ్రోలునందు నెలకొల్పిన దాతఁడే. మరియు రైతుప్రబోధమునకు రంగా 'రైతాంగ భజనావళి' మున్నగు పాటల పుస్తకములఁ దయారు చేయిం చెను. ఈ విద్యాలయమును గాంచియే దేశమునం దన్నివైపు లను రాజకీయ ప్రచారమునకు వేసంగి పాఠశాలలు బయలు దేరినవి. ఇతరుల నభివృద్ధికిఁ దెచ్చు గుణము రంగాయందు మెండుగ నున్నది. నేఁడు రాజకీయములందు రచనలయందు ప్రసిద్ధులగు యువకులలో చాలమంది యొకప్పుడు రంగాగారి శిష్యులే.

రంగా 1931 సెప్టెంబరులో జరిగిన బొంబాయి కాంగ్రెసు సర్వసభ్య సమావేశమున కాంగ్రెసు ప్రధానహక్కుల పత్రికా లికయందు సామ్యవాద సూత్రములను జొప్పింపఁ బోరా డెను. 1933 లో పూనానగరమున కాంగ్రెసు సామ్యవాద బృందమును స్థాపించెను. అతఁడు పాట్నా నగరమున జరిగిన 'కాంగ్రెసు సోషలిస్టు' సమావేశమునఁ బ్రధానపాత్ర నిర్వ హించెను శాసనసభల యెన్నికలను బహిష్కరింపవలె నను సూచననుమాత్ర మంగీకరింప జాలఁడయ్యెను. రంగా 1934లో

"ఆంధ్ర కాంగ్రెసు షోషలిస్టుపార్టీ" కధ్యక్షుడుగా నెన్నుకొనఁబడెను.

ఇంతలో కేంద్ర శాసన సభకు ఎన్నికలు వచ్చినవి. అందు రంగా కాంగ్రెసభ్యర్థిగానిలచి యత్యధికమగువోట్లతో గెలుపొందెను. ఆతడు శాసనసభ యందున్నంత కాలము రైతుల సేమము కొఱకే పోరాడు చుండెను. అందులకు నిదర్శనముఁగా నాతఁడు శాసన సభ్యులనుండి రైతుల నొక జట్టుగా వేరుపఱచెను.

ఆతఁ డెన్నిదినముల నుండియో అఖిలభారత కిసాను కాంగ్రెసును స్థాపింపవలెనని కలలు గనుచుండెను. అందులకై యాతడు 1935 ఆగస్టులో నొక సూచనఁ జేసెను. అక్టోబరు నెలలో మదరాసు నగరమున నాతని యగ్రాసనాధిపత్యమున నొక యఖిలభారత కృషీవలుల యభ్యున్నతికిఁ బాటుపడు వారల సమావేశము జరిగెను. కొందఱు కిసాను నాయకుల మనస్పర్థల వలన మదరాసు నందు సంఘటింపఁబడిన రైతుసంఘము డిసెంబరు 15 వ మీరటునందుఁ బునర్నిర్మాణము సేయఁబడెను. ఎట్టకేలకు 1936 ఏప్రియలునందు అఖిలభారత కిసాను మహాసభ లక్నోలో స్వామి సహజానంద గారి యధ్యక్షతను జరుపఁబడెను. ఆనాఁటి నుండియు ఆ కిసాను సంఘములు దినదినాభివృద్ధిని గాంచుచు నఖండ సేవ నొనరించుచున్నవి. ఈ సంఘమునకు వలసిన ధనము నంతయు మన రంగాయే చేకూర్చెను.

## భారతీ రంగా

ఆ మహాశయుని సతీమణి శ్రీమతి భారతీ రంగా యాతఁడొనర్చు ప్రతి ప్రజాహిత కార్యమునందును సహచారిణియై, పతిహితము నాచరించుచుఁ బ్రఖ్యాతివడసెను. భారత నాయకాగ్రణులలో సతీపతులు దేశసేవయందుఁ దమ సర్వస్వ మర్పించినవా రరుదు. ముఖ్యముగ మన యాంధ్రభూమిలో నట్టి మహాభాగ్యము మన రంగా దంపతులకే కలిగెను. వారి జీవితములు ధన్యములు. ఆమె 1925 న ఇంగ్లాండులో ఆక్సు ఫర్డు విశ్వవిద్యాలయమునఁ జదివెను. 1931 లో తెనాలిలో పికెటింగు చేసెను. 1932-33 సంవత్సరములలో సత్యాగ్రహో ద్యమమునఁ బాల్గొని, యామె చాలమంది యువతుల నాసమ రమునందు నడపెను. విదేశవస్త్రముల దుకాణములను, కల్లంగ డులను 'పికెటింగు' చేసి యొక సంవత్సరము కారాగృహ వాస మొనరించిన దా వనితామణి. ఆమె 1941 లో అఖిల భారత రైతుకాంగ్రెసు అధ్యక్షురాలుగ, 1942 లో ప్రధాన కార్యదర్శినిగ నుండెను. ఆంధ్రరైతుకాంగ్రెసుకు అధ్యక్షురా లుగ గొంతకాలముండెను. ఆమె స్వయముగ గోభూమియందు మాగాణి మెట్ట వ్యవసాయము చేయించు ఆదర్శవనిత.

రంగాగారికి దేశమునందు రైతుజనబాంధవుఁడను కీరితి స్థిరపడియెను. 1937 లో నాయకాగ్రణియగు జవ్హారీలాలాంధ్ర దేశపర్యటనమున పొన్నూరు గ్రామమున రైతులను గూర్చి ముచ్చటించుచు "నా రాష్ట్రమందలి రైతుల యిక్కట్టుల నెఱుంగుదుగాన మీా సమస్యలను నేను గ్రహింపఁ గలిగితిని.

ఆచార్య రంగాగారిచేఁ బ్రారంభింపఁబడిన యుద్యమము ననుస రింపఁ బ్రయత్నించితినిగాన మీా సమస్యలను బాగుగాఁదెలిసి కొనఁగలుగుచున్నా”నని యుద్ఘాటించెను.

1931 నుండి నేఁటివఱకు రంగా కేంద్ర శాసనసభా సభ్యుఁడు, అఖలభారత కాంగ్రెసు సంఘసభ్యుడు. మన దేశ మున నూటికిఁ దొంబదిమంది రైతులుగాన కాంగ్రెసు కార్య క్రమమున రైతుద్ధరణ ప్రణాళికనుఁ జేర్పవలెనని యాతని యభిమతము. కాంగ్రెసే రైతు, రైతే కాంగ్రెసుగ నాతఁడు భావించును.

రంగా ఢిల్లీ శాసనసభయందలి ‘కాంగ్రెసుపార్టీ’ పక్ష మునఁ గొంతకాలమువర కార్థిక పరిశీలనాసంఘ (Statutory Committee) కార్యదర్శిగాఁ బనిచేసి దొరతనము వారి యార్థికనీతి రహస్యమును బయటబెట్టెను. ఇప్పుడు మరల కేంద్ర శాసనసభయందలి కాంగ్రెసుపార్టీకి కార్య దర్శిగా నెన్నుకొనఁబడి తదున్నతి కెంతయుఁ గృషి యొనర్చు చున్నాడు. 1939 యుద్ధారంభమునుండి తీవ్రతరాందోళన చేయుచుండుటచే వారి సోదరులు శ్రీ లక్ష్మీనారాయణను 1940 మార్చియందును, రంగాను ఏప్రియిలులోను ప్రభుత్వ మువారు నిర్బంధించిరి. 1942 మార్చిలో వారు విడుదలచేయ బడిరి. తిరిగి 1942 ఆగష్టు విప్లవసందర్భమున వివిధరాష్ట్రము లందు గోప్యముగ విప్లవకార్యముల నడపించినపిమ్మట నా యాంధ్రప్రముఖుని “డెటిన్యూ”గ ప్రభుత్వమువారు నిర్బం ధించిరి. 1944 లో విప్లవతీవ్రత తగ్గినదని విశ్వసించినపిమ్మట

ఆయన విడుదల చేయఁబడెను. అప్పటికప్పుడే గాంధీజీ విడుదలై సేవాగ్రామమున నుండెను. రంగా విడుదలైనదేతడవుగా సేవాగ్రామమున కరిగి గాంధీజీని సందర్శించెను. అప్పుడు వారిరువురు కాంగ్రెసు భావికార్యక్రమమునుగూర్చి విపులముగా మాట్లాడుకొనిరి. అది చరిత్రాత్మకమైనది. ఆనాడు మహాత్ముడు కర్షక, కార్మిక ప్రజారాజ్యమును సాధించుటకుఁ గాంగ్రెసు పూనుకొనునని రంగాద్వారా దేశమునకుఁ దెలియజేసెను. ఈ ఘటన, పట్టుదలతో, ధైర్య సాహసములతో శ్రామికుల రాజకీయములగు హక్కులకై రంగా వాదించుటను తెలుపును. మరియు మహాత్మునకు రంగాపై మిక్కిలి విశ్వాసము ప్రేమ గల వనుటను దెలుపును.

## సుబాస్ మైత్రి

రంగా, భారత స్వాతంత్ర్య సంపాదనకు విప్లవ మార్గముల తీవ్రతరముగ కృషి చేయవలయు నను సంకల్పము గలవాఁడు అందుచే సుబాస్ చంద్రబోసుతో నాతనికి మైత్రి గలిగెను. త్రిపురీ కాంగ్రెసులో సుబాసుని జవహరలాలు ప్రతిఘటింప, కమ్యూనిస్టులు విడువ, కాంగ్రెసు, సోషలిస్టులు మధ్యవర్తులై యుండ, రంగా బోసు పక్షమున అతి ధైర్యముతో నిలబడెను. రంగా మహానాయకుల నందరిని ధిక్కరించి బ్రహ్మాండముగా నుపన్యసించెను. మరియు రాంఘరు కాంగ్రెసు సందర్భమున బోసుబా బేర్పరచిన "రాజీ ప్రతిఘటన సభ"కు తోడ్పడెను. నేతాజీబోసుబాబు స్థాపించిన "ఫార్వర్డుబ్లాకు" నకు నామకరణ మొనర్చినది రంగాజీ.

# వి వి ధ రం గ ము లు

రంగా ప్రవేశములేని రాజకీయరంగము లేదు. నవ యుగ చైతన్యమునకు వలయు వివిధ రంగములం దాతఁడు చేరి యాయా సంస్థల పురోభివృద్ధికి నపారమైన కృషి సల్పు చుండును. కాంగ్రెసు మహావృక్షపు పలు శాఖలయందుఁ జరించుచు నాయా శాఖా విలసనమున కత్యంత సంతోషము ననుభవించిన పికరాజ మా యాంధ్ర నేత. కాంగ్రెసు విద్యు త్తును భిన్నభిన్న ప్రదేశములందు, భిన్నభిన్నము లైన యుప యోగముల కొఱకు వినియోగింపఁ జేసిన మేటి శాస్త్రజ్ఞుఁ డాతఁడు.

విద్యార్థి, మహిళా, చేనేతకార్మిక, కాంగ్రెసు సంస్థల స్థాపించిన వాఁడు రంగా. వయోజన విద్యాసంఘమును నెల కొల్పెను. విద్యార్థి పౌరసత్వశిక్షాశాలకు బీజములు నాటెను. మరియు నాతడు నూనె పదార్థముల ఉత్పత్తి సంఘమును బాదుకొల్పెను. పుగాకు సంఘమును సృష్టించెను. వ్యవసాయక కూలీసంఘమును బ్రతిష్ఠించెను. ఈ విధముగా నాతడు పలు విధములైన సంఘముల యుత్పత్తికిఁ గారణభూతు డయ్యెను. ఆతని శక్తి బహుముఖములైనది. వ్యవస్థాపనతో నాతని పని ముగియదు. తత్సంఘోద్ధరణమునకు, క్రమ వికాసమునకు నాతఁడు విసుకు విరామములులేక యహర్నిశలు దేశమం తెల్లెడఁ గ్రుమ్మరుచుఁ బ్రచారము చేయుచుండును.

రంగా మేధాసంపద నిరుపమానమైనది. సభావేదిక లపై గంటల తరబడి యుపన్యాసము లొసఁగుటయే గాక

కార్యరంగమున దుమికి తన యాశయసిద్ధికి కృషి సల్పుటలో నాతఁ డందెవేసినచెయ్యి. దేశనాయకు లింక పదివత్సరములకు నవుపనెంచు ప్రతి యుద్యమమును ముందుగ ప్రచారమొనర్చు నిశితదృష్టి యాతనిది. జమీందారీల విధానము గానిండు, పలు రంగములయందలి కాంగ్రెసు ప్రచారము గానిండు, హరిజనోద్ధరణ గానిండు. ఏదియైనను నాతఁడు మున్నే గ్రహించి దాని ప్రచారమును గావించుచుండును. అట్టి సునిశిత కుశాగ్రబుద్ధి, యనితర దుర్లభము.

రంగాజీవితాశయము కార్మికకర్షక సమ్మేళనము. దాని కొఱకే యాతఁ డనుదినము జపించుచుండును. దాని కొఱకే కృషి చేయుచుండును. కిసాను కాంగ్రె సాతని సృష్టి. అఖిల భారత కిసాను కాంగ్రెసున కాతఁడధ్యక్షుఁడు. కూలీపై రైతాధారపడి యున్నాడు. ఆ రైతుపై కూలిఆధారపడియున్నాడు. వారిరువురి సంబంధ మవినాభావము. వారిలో వారికి స్పర్థలు జనించెనా, లోకము పస్తుండవలసినదే. వారిద్దరిచేరిక చేతనే నవభారతవర్షము రత్నరాసులు పండించగలదు. వా రిరువురి కలయికయే యువభారతమునకు సౌఖ్యాస్పదము. వారియైకమత్యమే భారతభూమికి సౌఖ్యాస్పదము. ఈరహస్యము నెరింగియే శ్రీ గాంధిమహాత్ముని యహింసా సత్యముల ప్రచారామృతధారను రంగా ప్రజాహృదయ క్షేత్రములఁ బ్రవహింపఁజేసి స్వాతంత్ర్య సస్యబీజముల నాటుటకు సారవంతమొనర్చి కృతకృత్యుఁ డయ్యెను. ఇట్టి సర్వమానవ సౌభ్రాతృత్వము పునాదిగా గలిగిన స్వాతంత్ర్యమే సుస్థిరమై వెలయును.

రంగా తన మహదాశయమైన రైతు, కూలీ, బుద్ధిజీవి, పారిశ్రామికుల రాజ్యస్థాపనమును జాతీయకాంగ్రెసుచేత నంగీరింపఁజేసెను. గాంధిమహాత్ముని యాశీస్సుల నందెను. మహాత్ముఁడు, కాంగ్రెసు దీని నొప్పుకొనినంతమాత్రమునఁ జాలదని రంగా గ్రహించెను. అతఁడు ప్రజాస్వామ్యవాది. ఈ యాశయము నెదిరించుచు కూలీ నియంతృత్వమే సాధనయోగ్య మని ప్రచారము చేయు పక్ష మొకటి కలదు. అది 'తన పార్టీ' లను ప్రపంచమునందన్ని దేశములందును స్థాపించుకొని విరివిగా ప్రచారము సాగించుచున్నది. అట్టిది మన భారతభూమియందును వెలసియున్నది. దాని ప్రచారము నెదుర్కొనవలసియున్నదని రంగా సూక్ష్మదృష్టిచే గ్రహించెను. వెంటనే యాతఁడు దానికిఁ బూనుకొని, కార్యరంగమున నడుము బిగించి దుమికినాఁడు. యూరపుఖండమున విజృంభించుచున్న కార్మికనియంతృత్వమును ఆతఁ డెదిరింపఁ దలఁచెను. రంగా 1946–47 లలో మూఁడుమారులు యూరపున కరిగెను. అచట జరుగుచున్న ప్రపంచ ప్రతినిధుల సభాముఖముల శ్రీ శాంతిదూత, మహాత్ముని విశ్వమానవకళ్యాణగీతాగానమునొనర్చి యాతడు మంత్రరుద్ధ భుజంగముల కైవడి విదేశీయుల నొనర్చెను. ప్రజారాజ్యాశయ ప్రాశస్త్యముగల మృదుమధుర వచోఝరీ ధారాప్రవాహముల వారిని ముంచి తేల్చెను. రంగా 'మార్క్సు' మహాశయుని సిద్ధాంతముల నీనాఁటి ప్రపంచ ప్రజారక్షణాస్పదముగ పునర్నిర్వచనము చేయవలసిన యావ

శ్యకతను నానాదేశములందలి 'సోషలిస్టు' ప్రముఖులచే నంగీక రింపఁజేసెను. ప్రపంచ ప్రజానీకమునకు 'మార్క్సు' సిద్ధాంత ములవలన ప్రమాదము చేకూరకుండవలయుననిన మహాత్ముని యహింసా సూత్రమునే యాధారముగాఁ గొనవలెనని రంగా నొక్కి వక్కాణించెను. శ్రామికజీవులెల్లరు సర్వతోముఖాభి వృద్ధినొంది, సౌఖ్యప్రదముగ జీవింపవలయును. అందులకు సర్వశ్రామికులకు సమానమైన సంపూర్ణాధికారము లభ్యము కావలెనని రంగా యుద్బోధించెను. కార్మిక నియంతృత్వము పనికిరా దనెను.

రంగా హృదయ మెల్లప్పుడు పతితజనోద్ధరణకుఁ గడంగు చుండును. దేశమునందు నేఁడు సాంఘికముగ, నార్థికముగ వేనవేలు జనులు పతితు లయి, పలుబాధలకు గుఱి యగుచు న్నారు. అట్టి దీనులఁగాంచినచో రంగా హృదయము పరితపిం చును. వారికై వాని యంతరాత్మ యాక్రోశించుచుండును. ఆతఁడు బాల్యమునుండియు హరిజనోద్ధరణకు నాతురతఁజెందు చుండెను. ఆనాటినుండియే పర్వతారణ్య ప్రాంతముల నాకు ల[illegible]ములఁ దినుచు సర్వవిధముల నధఃపతితులయి, యీనాఁటి నాగరికతా చిహ్నముల లేశమైనను నలవఱచుకొనక, విద్యాగంధ మిసుమంతయు నెఱుంగక యున్న కొండజాతుల వారి నుద్ధరింప రంగా సంకల్పించుకొనెను. ఆతఁ డాంగ్లదేశ మున నున్న 1931 వ, వత్సరముననే ప్రపంచమునందలి 'పతిత ప్రజారక్షణ సంఘము' నొకదానిని స్థాపించెను.

రంగాది యతంర్జాతీయ దృష్టి. ఆ దృష్టి సునిశితము.

ఆతనిది ప్రపంచ పంథా. కావుననే భారతదేశమునందు మాత్రము సామ్రాజ్య వ్యతిరేక పోరాటము సాగించినఁ జాల దని యాతని యాశయము. ఈ సామ్రాజ్య పిశాచము ప్రపంచమునం దన్ని దేశముల యందును విలయ తాండవ మాడుచుండుట నాతఁడు గ్రహించెను. అట్టి పిశాచమును మొదలనంటఁ దుడిచిపెట్టవలె నని యాతఁడు కృతనిశ్చయుఁ డయ్యెను. అందులకనియే రాజకీయార్థికాది రంగముల పతితులైయున్న సర్వప్రపంచ జనుల నేకముచేసి, వారియందు పరస్పర సహకారభావము రేకెత్తించి, స్వాతంత్ర్య పోరాటముల సాగింప వలెనని యాతని పరమ విశ్వాసము. అందులకే తనవలె నంతర్జాతీయ దృక్పథము గల జవహర్లాలు, సుభాసుబోసు • మొదలగు నాయకులతో నాతఁడు హృదయపూర్వకముగా సహకరించెను.

రంగా, 1940 లో జైలునందున్నపుడు పతిత జనుల స్వాతంత్ర్య సంపాదనమును గుఱించిన సూత్రముల నిర్వచించుచు నొక గొప్ప గ్రంథము నాంగ్లమున రచించెను. అయ్యది 1946 లోఁ బ్రకటింపఁబడినది, ఆ గ్రంథము నందలి కార్యవిధానమే నేఁ డాఫ్రికా, అమెరికా దేశాల యందలి నీగ్రోలకు, తదితర ప్రజలకు మార్గదర్శకమగుచున్నది. రంగా పతిత జాతుల స్వాతంత్ర్య సంపాదనకై కృషిచేయు వారందఱఁ జేర్చి లండనులో సంఘము నేర్పఱిచెను. అద్దానికి సుప్రసిద్ధ సోషలిస్టు నాయకుఁడు ఫెన్నర్ బ్రాక్వే యధ్యక్షుఁడు. అందువలననే రంగా 1946–47 లలో నాంగ్లభూమికేగిన తఱి, నీగ్రో

జాతీయ నాయకులెందఱో వానిని గురువుగను, నాత్మీయ బాంధవుని గను, సుహృద్వరునిగను భావించి సేవించిరి. రంగా బోధనామృత పానకుతూహలాయత్తచిత్తముల వత్తతిఁ బెక్కు సభల నేర్పఱచిరి. ఇట్టి కాంగ్రెస్ సూత్ర నిర్వచనముల వలనను, వాని ప్రచారముల వలనను మహాత్మా, నెహ్రూల యభిమానపాత్రుఁడై రంగా భారత జాతీయ రంగస్థలమున వెలుంగుచున్నాడు.

## రచనలు

ఎన్. జి. రంగా కార్మిక, కర్షక, పతితజన, ఆర్థికనీతి మున్నగు విషయములఁ గూర్చి యాంగ్లమునఁ బెక్కు గ్రంథములు రచించెను. అందు (Modern Indian Peisant) నేఁటి భారత రైతు, (Labour in South India) దక్షిణ భారత కార్మికోద్యమము (Economics Organisation of Indian Villages Vol. I & II) భారతగ్రామీణ యార్థికనిర్మాణము (World role of National Revolution) ప్రపంచ జాతీయ విప్లవములు ముఖ్యములు. తెనుఁగు బాసనుగూడ నాతఁడు హరిజన నాయకుఁడు, ఆధునిక రాజ్యాంగ సంస్థలు 'పాకిస్థాన్' మున్నగు గ్రంథములఁ బెక్కింటిని రచించెను. వాహిని, గోభూమి, చేనేత, ఆంధ్ర విద్యార్థి Rural Cottage Industries మున్నగు పత్రికల స్థాపనకు రంగా కారకుఁడు.

1945 లో కేంద్రశాసనసభ కెన్నికలు వచ్చినవి. గుంటూరు, నెల్లూరు మండలములనుండి యభ్యర్థిని నియమింపవలసి యుండెను. అప్పుడు కాంగ్రెసునం దాత డైకైక

ప్రతినిధిగా నియమింపఁబడెను. ఇంక నేమి పోటీలేకనే కేంద్ర శాసనసభా సభ్యుఁడుగా నెగ్గెను.

1942 లో భారతదేశమున బాధ్యతాయుతులగు ప్రజా నాయకులతో తాత్కాలిక ప్రభుత్వము కేంద్రమున నెల కొల్పఁబడెను. రంగాగారికి వ్యవసాయశాఖలోను, రైతాంగ వ్యవహారములలోను నున్న విజ్ఞానము, ననుభవము, దక్షతను గుర్తించి తాత్కాలిక ప్రభుత్వము, వారిని 1946 మేనెలలో నంతర్జాతీయ వ్యవసాయక ఫలసాయదారుల సభ (International Agricultural Producers Conference) కు భారతప్రభుత్వ ప్రతినిధిగాఁ బంపిరి. అందుఁ దన పాత్రను ప్రశంసాపాత్రముగ నిర్వహించి రంగా భారతభూమికే వన్నె తెచ్చెను. ఆ లండనునగరములో నేర్పఱచఁబడిన 'అఖల ప్రపంచ రైతాంగ' పీఠమునుండి, కష్టజీవుల ప్రజారాజ్య సిద్ధాంతములను రంగా ప్రకటించెను. అచ్చట సంస్థాపింపఁ బడిన అంతర్జాతీయ వ్యవసాయోత్పత్తిదారుల సంఘమునకు కార్యనిర్వాహక సభ్యుడుగా నెన్నుకొనఁబడెను.

రంగా యాంధ్రనాయకుఁడు. అతని నిష్కళంక నిరుప మాన సేవాభాగ్య మాంధ్రమాతకులభించుట ముదావహము. తన కొనర్చిన యుపకృతికి నాంధ్రమాత యతనిని అక్కునఁ జేర్చికొనినది. వాని శి లా వి గ్ర హ ము లు గ్రామము లందు ప్రతిష్ఠింపఁబడినవి. ది 26-10-45 న తేదీన గోవాడ గ్రామమున శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్యా గారిచే రంగాగారి

శిలావిగ్రహము బహిర్గతమొనర్పబడినది. ఇంకను పలుతావుల శిలావిగ్రహములు స్థాపింపఁ బడినవి.

ఇట్లుండ 1947 మే 7 వ తేదీన రెండవ ప్రపంచ వ్యవసాయోత్పత్తిదారుల మహాసభ హాలెండులో హేగ్ నగరమున జరిగెను. దానికి భారత ప్రభుత్వము కొందఱు సభ్యులను పంపెను. ఆ బృందమునకు నాయకుఁడై ఆచార్య రంగా అచటి కేగి తన యశేష ప్రతిభా విశేషమును గనఁబఱచి రైతు సమస్యల మేటియని ధ్రువపఱచెను. అచట నేర్పరుపఁ బడిన ప్రపంచ వ్యవసాయ మహాసభ కెన్నుకొనఁబడిన నల్వురే నల్వురు సభ్యులలో మన భారతప్రతినిధి రంగా యొకఁడై ప్రపంచ సంచార మొనర్చుచు లాస్కీ మున్నగు వారితో నేఁటి సమస్యలను జర్చించెను.

రంగాసేవను ఆకాంక్షించియే యాంధ్రప్రజ 1946 మే 16 వ నాఁడు విదేశ సంచారమున నున్నతఱి ఆతనిని రాష్ట్రకాంగ్రెసున కధ్యక్షునిగా నెన్నుకొనెను. తన రాష్ట్రీయుల పిలుపు నందుకొని స్వదేశమున కాగతుండై పూజ్యంబగు రాష్ట్ర కాంగ్రెసధ్యక్షతను స్వీకరించెను. ద్విగుణీకృతోత్సాహుఁడై, యహరహము, కాంగ్రెసును శాఖోప శాఖలుగా విజృంభింపఁ జేసి తీవ్రప్రచారము గావించు చున్నాఁడు. చెన్నపురియందు జరిగిన 19-వ రాష్ట్ర రాజకీయ మహాసభ సమయమున (సెప్టెంబరు 7, 8) కాంగ్రెసు విజ్ఞాన పరిషత్తు, సాహిత్య దర్బారును జరిపి జాతీయ రచయితలను సత్కరించినది.

## ఆంధ్ర ప్రదేశము

శా॥ లే! దివ్యాంధ్రుడ! జాలమేల యదిగో లేగెన్ మహా విప్లవం
బా దివ్యాగ్ని మహోగ్ర కీలలవె బ్రహ్మాండంబులన్ జుట్టుచున్
వాదేలా! యెవ్వరడ్డమైనను సరే స్వాతంత్ర్య మార్గంబునన్
బూదించేయును శూరతన్ నిలువుమా! పూర్ణార్థ స్వామ్యమ్ముకై.

ఆగస్టు 15, చరిత్ర ప్రసిద్ధమైనది. ఆనాడు మాతృభూమి రాజకీయ స్వాతంత్ర్యము బొందినది. ఉత్సవములు జరుపుకొనినది. కాని దేశమున మతకలహములు హెచ్చినవి. మానవులు దానవులై పరస్పర హత్యలకు, గృహదహనములకు, శిశు, స్త్రీ వృద్ధ హత్యలకు తయారైనారు.

దేశమున ఆహారసమస్య విషమించినది. నైజాము దురంతములు మితిమీరినవి. క్షామము నుండి ప్రజలను రక్షింపవలసి వచ్చెను. సంఘమునందలి దురాచారములను హెచ్చుతగ్గులను మట్టుపెట్టి సమానవకాశములను గలిగింప ఆర్థిక సమానత్వమునకై నిరంతర ప్రయత్న మవసరము. దేశమున 'ఏక్ హో' ప్రజానినాదము ప్రతిధ్వనింపవలయును. హిందూ-ముస్లిము మిత్రత నాయకులలో మిత్రత అత్యంతావశ్యకములు.

మనము ఆంధ్రరాష్ట్ర సంపాదనకొఱకు 40 సంవత్సరములనుండి యవిశ్రాంత కృషి సలిపితిమి. మహాపండితులు ప్రజ్ఞాశాలురు దేశోద్ధారకులు నిరంతరము కృషిసలిపియు స్వరాష్ట్రమును సంపాదింపలేక పోయిరి. సింధు, ఉత్కళములు ప్రత్యేక రాష్ట్రములను సాధించినవి. మనము భారత రాజకీయ

స్వాతంత్ర్య సంసిద్ధికొఱకై రాష్ట్రవాంఛను మరచితిమి. రాజకీయ స్వాతంత్ర్యము సిద్ధించినపిదప రాష్ట్రసిద్ధికై త్వరపడక ఎట్లుండగలము? స్వయంపోషకత్వమున వైశాల్యమున జనాబాయందు వ్యాపార ఖనిజ సంపదలయందు మనము ఏరాష్ట్రమునకుఁ దీసిపోము. ఆంధ్రప్రదేశ 1,10,250 చదరపు మైళ్ళ వైశాల్యముగల్గి దాదాపు 3½ కోట్ల జనాభాతో రాణింపగలదు. విభజించి పాలించు సామ్రాజ్యవాదులు ఆంధ్రులను నైజాం, బస్తర్, బనగానపల్లి, మైసూరు సంస్థానములక్రింద మద్రాసు ఒరిస్సా మధ్యరాష్ట్రముల రూపమున ఆంధ్ర ప్రదేశమును తారుమారుగా విభజించుటచే మిత్రతకు భంగము కలిగినది. రాయలసీమ, సర్కారులు, తెలంగాణా భాగములు గల విశాలాంధ్ర ప్రజారాజ్య నిర్మాణమునకై అందఱు ఐకమత్యముతో కృషిచేసిరి. రామపాదసాగర్, కృష్ణా, పెన్నా, తుంగ్ర, ప్రాజెక్టుల నిర్మాణములకు, ఆర్థిక స్వయంపోషకత్వమునకు పరిశ్రమాభివృద్ధికి ప్రత్యేక రాష్ట్రమవసరము. లేనిచో సంస్కృతి, విజ్ఞానము, ఆచారము, వ్యక్తిత్వము, గౌరవము తగ్గిపోవును. రాష్ట్రసంపాదనకై దేశభక్త కొండా వెంకటప్పయ్యగారు 1911 లో విత్తనమువేసిరి. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులై ప్రకాశం, పట్టాభి, రంగాగారలు తీవ్రముగా కృషిచేసిరి. తుదకు పొట్టి శ్రీరాములు యాత్మాహుతిచే, ఆంధ్రుల తీవ్రకృషిచే 1953 అక్టోబరు 1 న రాష్ట్ర నిర్మాణమైనది. 1956 నవంబరు 1 కి తెలంగాణాతో కలసి --- × --- ౛ేశ్ అవతరించినది. ఆంధ్రజాతియొక్క సంపూర్ణా

భ్యుదయమునకై ఆంధ్రనాయకులు తీవ్రకృషి యొనర్చుచున్నారు.

రంగా కాంస్య విగ్రహము 1957 జూలై 12 న విజయవాడయందు స్థాపితము.

భారతీ రంగా నేడు ఆంధ్రప్రదేశ ఎగువ శాసనసభ్యురాలు. రంగా జయంత్యుత్సవములు ప్రతి సంవత్సరము పలుచోట్ల జరుపబడుచున్నవి. రంగా కేంద్రప్రభుత్వమున "పబ్లిక్ అకౌంట్సుకమిటీ చెయిర్మను"గా నియమింపబడెను. భారతీ రంగా దంపతులు ధన్యులు.

# పద్య సుమాంజలి

తెలుఁగుం గడ్డన కాదు భారతమునందే కాదు సర్వక్షమా
వలయం బందును "రైతుపాలఁ గల దేవ్వం"దన్న నిన్నేకదా
తొలుతం జెప్పెద-రిట్టి నీవు తెనుఁగుం దోఁబుట్టువై మా తపం
ఫలు పండించితె! వాసికెక్క దగిన కాపుంజూపె నీ సేద్యముల్.

తెలుఁగు నుడికార మందున్న మెలపు నెఱిఁగి
తెలుఁగు హృదయంబు నందున్న తీపి నెఱిఁగి
తెలుఁగు సంస్కృతి యందున్న చెలువ మెఱిఁగి
తెలుఁగునకు నీవు సరిక్రొత్త వెలుఁగు లిడితి.

నాలుగు కోట్ల తెల్గు లొక నాయకరమ్మున వెల్గునాఁడు పాం
చాలముఁ దొట్టి ద్రావిడ, మసాము దొడంగి మరాట దాఁకనీ
నేలకు సాటి వచ్చు నవనిం గనుఁగొందుమె? యాంధ్రజాతి కీ
మేలు ఘటింపు మంచుఁ బ్రణమిల్లెద దుర్గకు నిష్టభర్గకున్.

నిను దేశభక్తుఁగా మె
చ్చిన వారలు కలరు మహి నశేష ప్రజ; లీ
వొనరించిన భాషాసే
వ నెఱింగిన వార లెన్ని వందలు కలరో !

కవి యెవఁడో ప్రజాభ్యుదయ కాముకధీపరిణద్ధుఁ డెవ్వఁడో
ప్రవిమల వృత్త దీప్తి పరిభాసురుఁ డెవ్వఁడో నిగ్గు దేల్చు వా
రవనికి నేతలై వెలసి నప్పుడె ధర్మువు గెల్చు గారడీ
రవరవ లిచ్చుటం బనికి రావు కులమ్ములు గావు నిచ్చెనల్.

రాచఱికమ్ము సేయుటకు రైతొకఁడే తగు నంచు ధర్మముం
బ్రోచు నతండ యంచు,మన పూజలు గొన్న గురుండు
కాయముం
ద్రోచుచుఁ బల్కె గాంధి; ఋషితుల్యుఁ డతండు మన
మ్ములో నినుం
జూచియ చెప్పె నట్లనుట సూనృత మోయి! జగద్ధితాగ్రణీ.

ఢిల్లీ లోపల నున్న శీతనగ పీఠిన్ టోకియో వీధిలో
నిల్లుం గట్టిన రూజువెల్టు మహిలో హిట్లర్ కడన్ గాలమున్
వెళ్లం బుచ్చిన నూర్ధ్వ లోకములకే వేంచేసినన్ దెల్గువాఁ
డుల్లంఘింపఁగ రాదు తల్లిపలు కెట్లో రక్ష సేయం దగున్.

కడపన్ నిద్దుర లేచి హస్తిపురిలో కాఫీని సేవించి చే
రెఁడు రొట్టెన్ కెయిరో కడ న్నమలి పారిస్ పూఁటకూ
టింటిలోఁ
గడుపు న్నింపి హితోక్తు లాడును ట్రుమన్ కల్పించు
దర్బారులో
నేఁడుబ్రో లీసుతుఁ డెట్లు వచ్చె జననీ! నీశక్తిఁ గాకుండినన్.

# జాస్తి వేంకట నరసయ్య,
# ధూళిపాళ వేంకట సుబ్రహ్మణ్యముల
## జాతీయ రచనలు

---

**కాంగ్రెసు విజయము** (చరిత్రాత్మక నాటకము) 1—0—0

డాక్టర్ పట్టాభి వంటి ఆంధ్రనాయకుల ప్రశంస లందినది

" 60 ఏండ్ల కాంగ్రెసు చరిత్రలోని ప్రధానఘట్టాలు - సంస్కరణాంకము, సంపూర్ణస్వరాజ్యాంకము, ప్రజాశిక్షణాంకములుగా చిత్రింపబడిన నాటక మిది. - భారత స్వాతంత్ర్య సమర చరిత్రను ఈ విధంగా నాటకరూపంలో వ్రాయడానికి జరిగిన తొలిప్రయత్నమే కాదు ఇది- ఘనప్రయత్నంకూడా. ఈ రచయితలు ఇరువురు గొప్ప పండితులు. దేశభక్తులు. వీరి రచనా-శైలి - పద్యాలు - గేయాలు హృద్యంగాగంభీరంగా ఉన్నవి"

—ఆంధ్రప్రభ

**ప్రజారాజ్యము** (సామ్యవాదనాటకము)
పలుచోట్ల ప్రదర్శింపబడినది.
**ఉపాధ్యాయుడు** (ఏకపాత్రనాటిక)
} 1—0—0

"ప్రజా రాజ్యం కలముతోటిగాక హృదయముతోటి రాసిననాటకము. ప్రస్తుతం దేశానికి [illegible] నాటకప్రదర్శనములేకావలసినవి."

— మాధవపెద్ది వెంకట్రామయ్య

శ్రమజీవుల కడగండ్లు జమీందారుల దౌష్ట్యములు మొదలగు విషయాలుగలవు. సామ్యవాద సమాజాన్ని స్థాపించుటకుప్రజల నెట్లుచైతన్యవంతులను చేయాలోకూడ స్పష్టంగా

# జాస్తి వేంకట నరసయ్య,
# ధూళిపాళ వేంకట సుబ్రహ్మణ్యముల
## జాతీయ రచనలు

---

**కాంగ్రెసు విజయము** (చరిత్రాత్మక నాటకము) 1-0-0

డాక్టర్ పట్టాభి వంటి ఆంధ్రనాయకుల ప్రశంస లందినది.

"60 ఏండ్ల కాంగ్రెసు చరిత్రలోని ప్రధానఘట్టాలు - సంస్థాపనాంకము, సంపూర్ణ స్వరాజ్యాంకము, ప్రజాశిక్షణాంకములుగా చిత్రింపబడిన నాటక మిది. - భారత స్వాతంత్ర్య సమర చరిత్రను ఈ విధంగా నాటకరూపంలో వ్రాయడానికి జరిగిన తొలిప్రయత్నమే కాదు ఇది- ఘనప్రయత్నంకూడా. ఈ రచయితలు ఇరువురు గొప్ప పండితులు. దేశభక్తులు. వీరి రచన-శైలి - పద్యాలు - గేయాలు హృద్యంగాగంభీరంగా ఉన్నవి"

—ఆంధ్రప్రభ

**ప్రజారాజ్యము** (సామ్యవాదనాటకము) పలుచోట్ల ప్రదర్శింపబడినది.
**ఉపాధ్యాయుడు** (ఏకపాత్రనాటిక) } 1-0-0

"ప్రజా రాజ్యం కలముతోటిగాక హృదయముతోటి వ్రాసిననాటకము. ప్రస్తుతం దేశానికి [illegible] నాటకప్రదర్శనములే కావలసినవి."

— మాధవపెద్ది వెంకట్రామయ్య

శ్రమజీవుల కడగండ్లు జమీందారుల దౌష్ట్యములు మొదలగు విషయాలుగలవు. సామ్యవాద సమాజాన్ని స్థాపించుటకు ప్రజల నెట్లు చైతన్యవంతులను చేయాలోకూడ స్పష్టంగా

పాత్రలముఖమున చెప్పబడినది. "కర్మా! కర్మ! ఈ కర్మఅను మాట ధనవంతులు ధనహీనులను దోచుకొనుటకు కల్పించిన పన్నాగము" ... — ఈ నాటకం చదువదగింది,

ప్రదర్శింపదగినదని మాయుద్దేశము:—మాతృభూమి.

(4) నలోద్ధీర్లి:-(దోపుచరిత్ర, ఎన్నికల ప్రకాశికలప్రకథ.) 0–8–0

(5) జయభేరి; – (జాతీయములగు ఖండకృతుల సంపుటి) 1–0–0

నిర్మాణ కార్యక్రమముపై జన్మభూమిపై దేశభక్తులపై వ్రాయబడిన పద్యరత్నములెన్నియో ఇందుగలవు. ఉపన్యాసకులు, హరికథకులు విద్యార్థులు దేశభక్తులు కంఠస్థము చేయవలసినవి. విశాలాంధ్ర మందంతటను వ్యాప్తిలో నున్నపద్యములు.

(6) వైతాళికులు:—(జాతీయనాయకుల జీవితచరితము 0–12–0

(7) ఆచార్యరంగా;—(జీవితచరిత్ర) 0–6–0

పద్యంబు నడకనుపరికించి చూతు మా
హృద్యమైమించునుగద్యరచన
గద్యంబు బిగువునుగాలించిచూతుమా
హృద్యమై మించును పద్యవితతిఁ
పద్య గద్యంబులభావించిచూతుమా
భావంబు లొంతొంటఁ బరువులెత్తు
భావంబు లోకమాఱు పనిగొనిచూతుమా
శైలితనంతనే సాగిచనును
శైలి నొకసారి చూతుమా సకలరసము
లుప్పతిల్లుచునుండును గుప్పలుగను
అవుర, నరస సుబ్రహ్మణ్య కవులకలము
దేశభక్తిని జాటుచుఁ జేఁజారిల్లు! !

కవిరాజా, పండిత, పెనుమెచ్చ సత్యనారాయణరాజా.

---

(అమ్మువారిక మంచి కమీషను ఇవ్వబడును.)

## జాస్తివారి - రచనలు చిలకలూరిపేట, (గుంటూరుజిల్లా.)

ఖండకృతి [సాంఘిక, ఆర్థిక సమతాబోధకము] 0–12–0

"ప్రతిష్ఠగల కవులుగ శ్రీ జాస్తి వేంకట నరసయ్యగారు, తెలుంగులకు చిరపరిచితులు, మృదు మధురమైన భాషలో జాలువారు తీయ తెనుగు పద్యాలలో హీనులదీనుల, బాధితుల ఆక్రందనలు చిత్రించే సహృదయులు. ప్రతిపద్యము మననము చేసికొనుటకు, శాశ్వతముగ పాడుకొనుటకు తగియున్నది. ప్రతి యాంధ్రుడు చదువదగిన గ్రంథము." —ప్రజా మత.

వ్యాసవాణి [అపూర్వ రచన. అవశ్యపాఠ్యము.] 0–6–0

'ఆంధ్రభాషలో పలువిధములైన విషయాలు తెలుసుకొనేందుకు వ్యాసములు చాలా అవసరం. అలా ఎవరు వ్రాసి అచ్చయినవి విపులంగా కనపడవు. వీరేశలింగముగారి రచనలలో కొన్ని ఉన్నా, అవి ఉపన్యాసాల రూపంలో ఉన్నాయిగాని విద్యార్థులకు ఉపయోగించేవిగా లేవు, ఆ వెల్తిని శ్రీ వేంకట నరసయ్యగారు కొంత తీర్చారీ గ్రంథంలో. ఇందులో సాహిత్యము, కళారాధన, సంస్కృతి, లలితకళలు, గేయకవిత, కవి, కర్మయోగి పఠనమందిర గ్రంథాలయ లాభములు, చిత్రశిల్పములు అనే శీర్షికలతో తొమ్మిది వ్యాసాలు ఉన్నాయి. ఇవి అన్నీ అందరికీ ఉపయోగించడం అల్లా ఉండగా విద్యార్థులకు బాగా ఉపయోగిస్తాయి. — ఆంధ్రపత్రిక.

కవిత: (ప్రసిద్ధాంధ్రకవి పద్యగేయ రత్నాలు. సంపాదన)0-8-0

నవగీతాలు; (జాతీయగేయములు. కంఠస్థము చేయదగినవి) 0—3—0

వయోజనవిద్య: (పెద్దలవిద్యకు తగ్గయు తోడ్పడు జాతీయరచన,0–4–0

ఆంధ్రసేవ: (మాతృభూసేవచే మాన్యులగు ఆంధ్రుల జీవితాలు) 1–0–0

వ్యాసవాణి: (రెండవభాగము, వివిధవ్యాసవిలసితము) 0–6–0

# ధూళిపాళవారి రచనలు:—

చిలకలూరిపేట, గుంటూరుజిల్లా.

## వెన్నెలకుప్పలు (ఖండకృతి) 0—8—0

వివిధ శీర్షికలతో వెలసిన పద్యాలుగల చిన్న ఖండ కావ్యం మంచిభావాలు, మృదుమధురమైన పదాలూగలిగి సక జనసామాన్యమైన ఛందస్సులోనే నడచిన పద్యాలతో రచ ముచ్చటగా ఉంది. పొట్లపక్షకవేసుంటా, సమ్యగమునం బాగుంద

'కోటప్పకొండ' శివప్రభావద్యోతకంగా, సహజభా రమణీయతా ప్రదర్శకంగా ఉంది. 'చంద్రా' అనే శీర్షికలో చంద్రుణ్ణిగూర్చి వర్ణించిన పద్యాలు హృద్యాలుగా ఉన్నాయి

'కవి' అనేశీర్షికలో వెలసిన పద్యాలు చిత్రకారుడికంటె కవిగొప్పవాడు అనే ఉద్దేశాన్ని నిరూపిస్తూ సోపపత్తికంగా ఉన్నాయి.

సుభాషితే—శీర్షికలోఉన్న పద్యాలు ఒక మాగపి పెండ్లినిగూర్చి వ్రాసినవి. చాలతమాషాఅయినకథ. చే కుండానవ్వించాయి. [ఆంధ్రపత్రిక

అహల్య: (పరీక్షకుయోగ్యమగు పౌరాణిక నాటకము) 0—12—

విశ్వనాథశతకము: (అమూల్యము)

సాయిబాబా: (హరికథ) 0—6—

బాలరామాయణ శతకము: (బాలురు కంఠస్థము చేయదగుపద్యా 0—4

విజయవ్యాసాలు: (విద్యార్థులకు మిక్కిలి సహాయపడును) 0—8

జయసుధ: (భారతనాయకులు జరిపిన సత్యాగ్రహముల చరిత్ర)1—0

---

పుస్తకాలకు :— 1 రచయితలు.

2 వేంకట్రామ అండ్ కో., విజయవాడ—1